# తీవ్ర రూపం దాల్చనున్న అల్పపీడనం!

## చెన్నై సహా 6 జిల్లాలకు భారీ వర్ష సూచన



ప్యారీస్,డిసెంబర్17 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రస్తుతం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతోందని, దీని ప్రభావంతో ఈ నెల 20వతేదీ వరకు చెన్నై సహా 6 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు తీవ్ర రూపం దాల్చడంతో దక్షిణ, డెల్టా జిల్లాల్లో వారం రోజుల నుంచి పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు వాగులు, చెరువులు, ఆనకట్టలు పూర్తిస్థాయిలో నిండాయి. దీంతో కోతకు సిద్ధంగా ఉన్న వరి, ఆరుతడి పంటలు నీటి పాలైనాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి దక్షిణ బంగాళాఖాతం మధ్య తీరంలో కేంద్రీకృతమైందని, ఇది గురువారానికి శ్రీలంక, తమిళనాడు తీరాలకు చేరే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం 5 గంటలకు ఏర్పడిన అల్పపీడనం సముద్ర మట్టం నుంచి 5.8 కిలోమీటర్ల దూరం వరకు విస్తరించిందని, రానున్న మూడు రోజుల్లో ఈ అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. తాజాగా ఏర్పడిన ఈ అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, తిరువారూర్, నాగపట్నం, చెంగల్‌పట్టు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో బుధవారం నుంచి శుక్రవారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

### చేపల వేటకు వెళ్లొద్దు

దక్షిణ బంగాళాఖాతంలోని మధ్య ప్రాంతంలో తాజాగా మరో అల్పపీడనం ఏర్పడిందని, ఇది మరో 48 గంటల్లో బలపడి సముద్రతీరం వైపు పశ్చిమ వాయువ్య దిశగా పయనించనున్నదని తమిళనాడు వాతావరణ శాఖ వెల్లడించింది. అల్పపీడనం కారణంగా రానున్న రెండు రోజుల్లో ఉరుములు, మెరుపులతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా మరో బలమైన అల్పపీడనంగా రూపుదిద్దుకుంది. ఈ అల్పపీడనం పడమర, వాయువ్య దిశగా సముద్రతీర ప్రాంతాల వైపు కదులుతోందని, ఇప్పటికే దీని ప్రభావం తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాలపై ఉండటం వల్ల మోస్తరు వర్షాలు కురుస్తున్నాయని వివరించారు. తీర ప్రాంతాల్లో మూడు రోజుల పాటు 35 నుండి 45 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని, ఈ క్రమంలో పుదుచ్చేరి రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకూడదని వాతావరణ శాఖ హెచ్చరించింది.




సత్కారసభలో గుకేష్‌కు రూ.5కోట్ల చెక్కు అందజేస్తున్న స్టాలిన్

# గుకేష్... యువతకు ఆదర్శం!

## ప్రశంసించిన సీఎం స్టాలిన్ ● నగదు పురస్కారంతో ఘనసత్కారం



ఊరేగింపుగా వెళ్తున్న గ్రాండ్ మాస్టర్ గుకేష్

చెన్నై, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పిన్నవయస్సులో వరల్డ్ చెస్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న చెస్ క్రీడాకారుడు గుకేష్ పట్టుదల, కార్యసాధన కోసం చేసిన ప్రయత్నం నేటి యువతకు ఆచరణీయమని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. చేపాక్ కలైవానర్ అరంగంలో రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన గుకేష్ సత్కారసభలో ఆయన ప్రసంగిస్తూ దృఢసంకల్పం, దృఢచిత్తమే తనకు విజయాన్ని సాధించిపెట్టాయంటూ గుకేష్ ఓ ఇంటర్వ్యూలో చెప్పడం విని సంతోషించానన్నారు. ఏడేళ్ల ప్రాయంలతో చదరంగంలో శిక్షణ పొంది, 12 యేళ్ల వయస్సు గ్రాండ్‌మాస్టర్ టైటిల్ గెలుచుకుని నేడు వరల్డ్ చెస్ ఛాంపియన్‌గా ఉన్నత శిఖరానికి చేరుకున్నాడని కొనియాడారు. ఓ గుకేష్ గెలుపు లక్షలాది మంది గుకేష్‌లను తయారు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రానికి చెందిన యువకులే గ్రాండ్‌మాస్టర్ టైటిల్స్ వరుసగా గెలవడంతో తమిళనాడు చదరంగానికి పుట్టిల్లయిందన్నారు. ఈ సభలో గుకేష్‌కు ఆయన రూ.5కోట్ల బహుమతి చెక్కురూపంలో అందించారు.

### నెరవేరిన చిరకాల కోరిక ...

గుకేష్ మాట్లాడుతూ 18 యేళ్ల ప్రాయంలో చాంపియన్‌షిప్ సాధించానని, ఇది తన చిరకాలపు కోరిక అని, పిన్నవయస్సులోనే చెస్ గ్రాండ్ మాస్టర్ కావాలనే కల నేడు నెరవేరిందన్నారు. చదరంగపు లోకంలో చెన్నై నగరం కీలమైనదని, తాను చెస్ ఛాంపియన్‌షిప్ సాధించడానికి ప్రధాన కారణం 2022లో చెస్ ఒలంపియాడ్ నిర్వహించిన ప్రభుత్వం తనలో ఉత్సాహాన్ని నింపిందని కొనియాడారు. ప్రపంచ ఛాంపియన్‌షిప్ పయనం చెన్నైలోని గ్రాండ్ మాస్టర్ల సాయంలేకుంటే సాధ్యపడేది కాదన్నారు. తనను ఆర్థికంగా, హార్థికపరంగా ఆదుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి గుకేష్ కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులకు సాయం మందించటంలో ఉప ముఖ్యమంత్రి అందరికంటే ముందుంటారని కొనియాడారు.

### గ్రాండ్‌మాస్టర్ల నగరం చెన్నై...

గ్రాండ్‌మాస్టర్‌గా ఐదుసార్లు విజయం సాధించిన చెస్ క్రీడాకారుడు విశ్వనాథన్ ఆనంద్ మాట్లాడుతూ చదరంగంలో తమిళనాడు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పిన్నవయస్సులో వరల్డ్ గ్రాండ్ మాస్టర్‌గా విజయం సాధించిన గుకేష్‌ను మనసారా అభినందిస్తున్నానని చెప్పారు. దేశంలో తొలి చెస్ గ్రాండ్ మాస్టర్, గ్రాండ్ మాస్టర్, మహిళా గ్రాండ్ మాస్టర్ ఇలా అందరూ తమిళనాడులోనే ఉన్నారని, చెన్నై నగరం చెస్‌గ్రాండ్‌మాస్టర్ల నగరమని చెప్పటం అతిశయోక్తి కాదన్నారు. 34 యేళ్ల క్రితం తాను చెస్‌గ్రాండ్ మాస్టర్‌గా టైటిల్ సాధించినప్పుడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి తనకు సత్కార సభ ఏర్పాటు చేయడం తానింకా మరువలేదని ఆనంద్ అన్నారు.

### అట్టహాసంగా ర్యాలీ...

తొలుత ప్రభుత్వ ఎస్టేట్ మెట్రోస్టేషన్ సమీపం నుంచి గుకేష్‌ను ఓపెన్‌టాప్ కారుపై కలైవానర్ అరంగం వరకు ఊరేగించారు. ఆ ఊరేగింపులో మయిలాట్టం, ఒయిలాట్టం వంటి గ్రామీణ నృత్యాలు చేశారు. మంగళవాయిద్యాలు, డప్పు వాయిద్యాలు నడుమ ఈ ఊరేగింపు కొనసాగింది. అదే సమయంలో రహదారికి ఇరువైపులా నగరవాసులు, యువతీ యువకులు గుకేష్‌కు స్వాగతం పలికారు. గుకేష్ కారులో నిలబడి ట్రోఫీని, చిన్న సైజు జాతీయ జెండాను పట్టుకుని ప్రదర్శించారు.

# అరుణాచలేశ్వరుడి సేవలో దుర్గా స్టాలిన్



అరుణాచలేశ్వరాలయంలో సీఎం సతీమణి దుర్గా స్టాలిన్

వేలూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామిని ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్ దర్శించుకున్నారు. ఆలయ కార్తీక దీపోత్సవాల సందర్భంగా ఆలయం వెనుక వైపున్న అన్నామలై కొండపై వెలిగించిన మహాదీపాన్ని దర్శించేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో వస్తున్నారు. ఈ నేపథ్యంలో, సీఎం సతీమణి దుర్గా స్టాలిన్ మంగళవారం ఆలయానికి వచ్చి, ఉన్నామలై సమేత అరుణాచలేశ్వరుని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# రెండాకుల కేసును త్వరగా తేల్చండి!

## ● ఈసీకి ఢిల్లీ హైకోర్టు ఆదేశం

చెన్నై, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండాకుల గుర్తును మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) నాయకత్వంలోని అన్నాడీఎంకేకి కేటాయించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన కేసులో కేంద్ర ఎన్నికల సంఘం త్వరగా తగిన చర్యలు తీసుకోవాలంటూ ఢిల్లీ హైకోర్టు మంగళవారం ఆదేశాలిచ్చింది. అన్నాడీఎంకేకు రెండాకుల గుర్తును కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీకి చెందిన మాజీ సభ్యుడు పుగళేంది ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు పిటిషనర్ నుంచి వినతిపత్రాన్ని స్వీకరించి అందులోని వివరాలను సమగ్రంగా పరిశీలించి కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాన్ని ప్రకటించాలని ఉత్తర్వులిచ్చింది. కోర్టు సూచన మేరకు పుగళేంది కేంద్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించినప్పటికీ సంఘం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఆ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్లు జ్ఞానేష్‌కుమార్, సుఖబీర్‌సింగ్ సాందు తదితరులపై పుగళేంది కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన పిటిషన్ ఢిల్లీ హైకోర్టులో వేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు రెండాకుల గుర్తు కేటాయింపు వ్యవహారంలో పుగళేంది సమర్పించిన వినతి పత్రంలోని వివరాలను పరిశీలించి వివాదాన్ని త్వరగా పరిష్కరించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఉత్తర్వులిచ్చింది. అదే సమయంలో పుగళేంది దాఖలు చేసిన కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనపై విచారణకు ముక్తాయింపు పలికింది.

# ఈరోడ్ తూర్పు నియోజకవర్గం ఖాళీ

పెరంబూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతితో ఈరోడ్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీగా ఉన్నట్లు ప్రకటించారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఈరోడ్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక జరిగే అవకాశముందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారుల సమాచారం.

# సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురు!

## ● కళ్లకురిచ్చి సంఘటనపై సీబీఐ విచారణకు గ్రీన్ సిగ్నల్



కల్తీసారా తాగి మరణించిన వారి బంధువుల రోదన (ఫైల్‌ఫొటో)

చెన్నై, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కళ్ళకురిచ్చి కల్తీసారా సంఘటనపై సీబీఐ విచారణకు ఆదేశిస్తూ మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలు పిటిషన్‌ను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. ప్రస్తుతం రాష్ట్ర సీబీసీఐడీ చేపడుతున్న విచారణను సీబీఐకి అప్పగించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేసింది. జిల్లా కేంద్ర కళ్ళకురిచ్చి కరుణాపురం ప్రాంతం వద్ద గత జూన్‌లో అశుభ కార్యానికి వెళ్లిన వారికి సరఫరా చేసిన కల్తీసారా తాగి 68 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసు విచారణ సీబీసీఐడీ స్వీకరించింది. అదే సమయంలో ఈ కల్తీసారా సంఘటన కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ అన్నాడీఎంకే, డీఎండీకే, బీజేపీ తదితర పార్టీల తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై విచారణ జరిపిన న్యాయమూర్తులు కృష్ణకుమార్, బాలాజీతో కూడిన హైకోర్టు ధర్మాసనం కళ్ళకురిచ్చి కల్తీసారా మృతి సంఘటనపై సీబీఐఈ విచారణ జరిపేందుకు అనుమతిస్తూ నవంబర్ 20న ఉత్తర్వులిచ్చారు.. ఈ తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీలు చేసుకుంది. దానిపై జరిగిన విచారణకు హాజరైన ప్రభుత్వ తరఫు న్యాయవాది డి. కుమనన్ కల్తీసారా కేసును సీబీఐకి అప్పగిస్తే విచారణ పూర్తయ్యేందుకు ఎక్కువ కాలం పడుతుందని, ఇప్పటికీ సీబీసీఐడీ విచారణ ముప్పావు శాతానికి పైగా ముగింపు దశకు వచ్చిందని, ఇలాంటి సమయంలో కేసును ఇంకో దర్యాప్తు సంస్థకు బదిలీ చేయడం సమంజసం కాదని వాదించారు. ఈ నేపథ్యంలో మంగళవారం న్యాయమూర్తులు జేపీ పరిడివాలా, ఆర్ మహాదేవన్‌తో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఎదుట ఈ అప్పీలు విచారణకు వచ్చింది. కళ్లకురిచ్చి కల్తీసారా కేసుపై రాష్ట్ర పోలీసులు విచారణ ముగిసిన నేపథ్యంలో మద్రాసు హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యంచేసుకోలేమంటూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలును తోసిపుచ్చింది. అంతే కాకుండా కళ్ళకుర్చి కల్తీ సారా సంఘటనపై సీబీఐ విచారణకు ఎలాంటి అభ్యంతరం లేదని, సీబీఐ వెంటనే దర్యాప్తు ప్రారంభించవచ్చునని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది.

# ఐటీ కంపెనీ కొనుగోలులో అవకతవకలు

## ● మూడుచోట్ల ఐటీ తనిఖీలు

అడయార్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ కేంద్రంగా ప్రధాన కార్యాలయాన్ని కలిగి చెన్నైలో కార్యకలాపాలు కొనసాగిస్తున్న కెపల్ ఐటీ కంపెనీకి చెందిన మూడు కార్యాలయాల్లో ఆదాయ పన్ను శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. వన్ పారామౌంట్ అనే ఐటీ కంపెనీని రూ.2100 కోట్లకు సింగపూర్ కంపెనీ కొనుగోలు చేసింది. ఈ ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టారు. కెపల్ ఐటీ కంపెనీ పోరూర్‌లో కార్యకలాపాలు కొనసాగిస్తుంది. ఈ కంపెనీ పోరూర్‌లో ఉన్న వన్ పారామౌంట్ అనే ఐటీ కంపెనీని రూ.2100 కోట్లకు కొనుగోలు చేసింది. ఇందులో కోట్లాది రూపాయల మేర అక్రమ లావాదేవీలు జరిగినట్టు వార్తలు వచ్చాయి. దీంతో కెపల్ ఐటీ కంపెనీకి చెందిన చెన్నై నుంగంబాక్కం, పెరుంగుడిలోని కార్యాలయాల్లో మంగళవారం ఐటీ అధికారులు తనిఖీ చేశారు. ప్రధానంగా పోరూర్‌లోని కెపల్ కార్యాలయంలో ఐటీ శాఖ జాయింట్ కమిషనర్ నేతృత్వంలో ఏడుగురు అధికారుల బృందం తనిఖీ చేసింది. అలాగే, పెరుంగుడిలోని కేస్ ఫిన్ హోమ్స్ కంపెనీలో ఆరుగురు బృందం సోదాలు చేసింది. ఇందులో వన్ పారామౌంట్ ఐటీ కంపెనీకి చెందిన బ్యాంకు ఖాతా వివరాలు, కీలక డాక్యుమెంట్లను పరిశీలించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఐటీ రిటర్న్లు తనిఖీ చేశారు. సింగపూర్ నుంచి కోట్లాది రూపాయలను చట్ట వ్యతిరేకంగా భారత్‌లో పెట్టుబడులు పెట్టిన ఆధారాలను ఐటీ అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఈ తనిఖీలు పూర్తి చేసిన తర్వాతే పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఐటీ అధికారులు వెల్లడించారు.

తప్పుడు అఫిడవిట్ కేసులో కోర్టుకు హాజరైన మాజీ మంత్రి కేసీ మణి 6

7 నేడు 'వణంగాన్' ఆడియో విడుదల

# కుంభకోణం జిల్లా ఏర్పాటయ్యేనా?

## ● స్టాలిన్ హామీ నెరవేరేనా



టి.నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చోళుల సామ్రాజ్యానికి రాజధాని నగరంగా విరాజిల్లిన కుంభకోణం. ఈ నగరం ఆలయాల నగరంగాను పేరుగడించింది. రాజధాని నగరానికి సంబంధించిన అన్ని హంగులు, సదుపాయాలుండటం వల్ల కుంభకోణంను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని స్థానిక రాజకీయ నాయకులు, ప్రజలు గత 26 యేళ్లుగా సుదీర్ఘ పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గత శాసన సభ ఎన్నికల సందర్భంగా చెంబనార్‌కోవిల్, ఒరత్తనాడులో ప్రచారం చేసిన డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ తమ పార్టీ అధికారంలోకి రాగానేవందరోజుల్లో కుంభకోణం ప్రాంతాన్ని కొత్తజిల్లాగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మరోసారి అసెంబ్లీ ఎన్నికలే రాబోతున్నాయి. ఇంకా ఆ హామీ నెరవేర్చలేదేనని స్టాలిన్‌పై కుంభకోణం ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారు. ఈ విషయమై కుంభకోణం కార్మిక వాణిజ్య సంఘాల సమాఖ్య, జిల్లా వాణిజ్య సంఘం కార్యదర్శి వి. సత్యనారాయణన్ మాట్లాడుతూ కుంభకోణంను కొత్తగా జిల్లా ఏర్పాటు చేయాలని రెండున్నర దశాబ్దాలుగా పోరాడుతున్నామని గత అసెంబ్లీ ఎన్నికల్లో స్టాలిన్ ఇచ్చిన హామీ నెరవేరుస్తారనే నమ్మకంతోనే ఈ ప్రాంతంలో ఉన్న మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ డీఎంకేని గెలిపించామని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీని మరో సారి అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ ఇంకా నెరవేర్చకపోవడం గర్హనీయమని, ఈ ఎన్నికల్లో డీఎంకే ఓటు బ్యాంక్‌కు గండిపడటం ఖాయమన్నారు. కుంభకోణం జిల్లా సాధన సమన్వయకమిటీ ఉపాధ్యక్షుడు కేఎస్ శేఖర్ మాట్లాడుతూ గత అన్నాడీఎంకే ప్రభుత్వ హాయంలో జిల్లా సాధన కోసం ఎన్నో ఉద్యమాలు చేశామని, ఆ ఆందోళనలలో డీఎంకే ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారని తెలిపారు. అయితే ఆ ఎంపీలూ, ఎమ్మెల్యేలలంతా కుంభకోణం ప్రజల చిరకాల కోరిక గురించి పార్టీ అధిష్టానానికి తెలియపరచకుండా మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. వచ్చే యేడాది జనవరిలో ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో కుంభకోణం ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించకపోతే డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడతామని ఆయన హెచ్చరించారు.



వి.సత్యనారాయణన్, కేఎస్ శేఖర్



ఈ విషయంపై కుంభకోణం డీఎంకే ఎమ్మెల్యే సాకోట్టై కే అన్బళగన్ మాట్లాడుతూ కుంభకోణం ప్రధాన కేంద్రంగా త్వరలో కొత్త జిల్లా ఏర్పాటుకు సంబంధించి ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించనున్నారని తెలిపారు. 1996 నుండి ఇప్పటివరకూ జరిగిన ఆరు శాసనసభ ఎన్నికల్లోనూ కుంభకోణం ప్రజలు డీఎంకేనే గెలిపిస్తూ వచ్చారు. ఇలా వరుసగా గెలిపిస్తున్న కుంభకోణం ప్రజల చిరకాలపు కోరికను ఇకనైనా జాప్యం చేయకుండా నెరవేర్చాలని ఆ ప్రాంతంలోని రాజకీయ నాయకులు, ప్రజలు డీఎంకే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. - డీఎంకే ఎమ్మెల్యే అన్బళగన్

# ఐఐటీలో కొత్త కోర్సు ప్రారంభం

## ● వచ్చే యేడాది నుంచి అడ్మిషన్లు



మీడియా సమావేశంలో ఐఐటీ-ఎం డైరెక్టర్ కామకోటి, సత్యనారాయన్ ఎన్ గుమ్మడి

చెన్నై, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ - మద్రాస్‌లో 'ఫేస్' (ఫైన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఎక్సలెన్స్ - ఎఫ్ఏసీఈ) అనే కొత్త కోర్సు ప్రవేశపెట్టింది. ఈ కోర్సులో 2025-26 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు కల్పించనుంది. ఈ విషయాన్ని మంగళవారం ఐఐటీలో జరిగిన మీడియా సమావేశంలో డైరెక్టర్ కామకోటి వెల్లడించారు. ఈ ప్రోగ్రామ్ కింద బీటెక్, బీఎస్ ప్రోగ్రామ్‌లో ప్రతి విభాగానికి రెండు సీట్లు కేటాయిస్తామని, వీటిలో ఒకటి మహిళలకు రిజర్వు చేసినట్టు వెల్లడించారు. దేశంలోని ఐఐటీల్లో కల్చరల్ ఎక్సలెన్స్ అడ్మిషన్ ప్రోగ్రామ్ ప్రవేశపెట్టిన తొలి విద్యా సంస్థగా మద్రాస్ ఐఐటీ గుర్తింపు పొందిందన్నారు. ఈ కోర్సులో భారతీయ విద్యార్థులతో పాటు ఓవర్సీస్ సిటిజన్స్ ఆఫ్ ఇండియా, పర్సన్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ (ఓసీఐ, పీఐఓ) అభ్యర్థులు కూడా అర్హులని తెలిపారు. ఈ కోర్సులో చేరదలచిన విద్యార్థులు మద్రాస్ ఐఐటీకి చెందిన "(https://jeeadv.iitm.ac. in/face' అనే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చని ఆయన వివరించారు. ఇంటర్ ఉత్తీర్ణతతో పాటు జేఈఈ (అడ్వాన్స్‌డ్) 2025లో సాధించిన ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారని ఆయన పేర్కొన్నారు. విలేకరుల సమాశంలో ఐఐటీఎం డీన్ (స్టూడెంట్స్) సత్యనారాయణ ఎన్ గుమ్మడి పాల్గొన్నారు.

## సమాచార దృష్టి

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా అన్నానగర్ పరిధిలోని అన్నానగర్ వెస్ట్, ఎక్స్‌టెన్షన్, డబ్ల్యూ బ్లాక్, బీసీ, డీ బ్లాక్‌లు, 11 నుంచి 20వ మెయిన్ రోడ్లు, తిరువల్లీశ్వరర్ నగర్, పేస్ బిల్డర్స్ ప్లాట్లు, మెట్రో జోన్ అపార్ట్‌మెంట్, ఎన్‌వీఎన్ నగర్, సీపీడ బ్యూటీ క్వార్టర్స్, ఎమరాల్డ్ ప్లాట్స్, క్లాసిక్ అపార్ట్‌మెంట్, సత్యసాయి నగర్, వెల్‌కమ్ కాలనీ 1 నుంచి 49 వరకు, టీవీ నగర్, జేఎన్ రోడ్డు, ఆసియాడ్, రోహిణి, పయనియర్ కాలనీ, పాత ఎల్ బ్లాక్, పాత జెడ్ బ్లాక్, ఏఎల్ బ్లాక్, 4వ అవెన్యూ, ఓల్డ్ తిరుమంగళం, 12వ మెయిన్ రోడ్డు, ఏఎఫ్ బ్లాక్, 2వ క్రాస్ రోడ్డు సి బ్లాక్, నెహ్రూ నగర్, 11, 15వ మెయిన్ రోడ్లు, ఏ,ఈ బ్లాక్‌లు తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

### మూడు జిల్లాల్లో 2 నుంచి అర్ధవార్షిక పరీక్షలు

పెరంబూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావిత జిల్లాల్లో వాయిదా వేసిన అర్ధవార్షిక పరీక్షలు జనవరి 2 నుంచి 10వ తేది వరకు నిర్వహించనున్నారు. కడలూరు, విల్లుపురం, తిరువణ్ణామలై జిల్లాలు తుఫాన్ కారణంగా తీవ్రంగా దెబ్బతినడంతో, ఈ జిల్లాల్లో అర్ధవార్షిక పరీక్షలు వాయిదావేశారు. ఈ జిల్లాల్లో జనవరి 2 నుంచి 10వ తేది వరకు అర్ధవార్షిక పరీక్షలు నిర్వహించాలని ఆయా జిల్లాల ప్రధాన విద్యాధికారులకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

### 13 నుంచి 'నమ్మ ఊరు తిరువిళా'

పెరంబూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలోని 18 ప్రాంతాల్లో జనవరి 13 నుంచి 17వ తేది వరకు చెన్నై సంగమం 'నమ్మ ఊరు తిరువిళా' ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనలను 13వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. అనంతరం 14 నుంచి 17వ తేది వరకు ఉదయం 6 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఎలియట్స్ బీచ్, తిరువాన్మియూర్ బీచ్, సైదాపేట మాంతోపు ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం, టి.నగర్ నటేశన్ పార్క్, అన్నానగర్ టవర్ పార్క్, కోయంబేడు జయ్ నగర్ పార్క్, కేకే నగర్ శివన్ పార్క్, కొళత్తూర్ కార్పొరేషన్ మైదానం సహా 18 ప్రాంతాల్లో ఈ ప్రదర్శనలు జరుగనున్నాయి. ఈ ప్రదర్శనంలో 1,500 కళాకారులు బృందాలుగా ఏర్పడి ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ ప్రదర్శనలు మదురై, కోవై, తిరునల్వేలిలో నిర్వహించనున్నట్లు సమాచార శాఖ మంత్రి స్వామినాథన్ తెలిపారు.

### సహకార సంఘాల ద్వారా పొంగల్ సరుకులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పొంగల్ ప్యాక్‌లో అందించే సరుకులు సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. జనవరిలో పొంగల్ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సహకార దుకాణాల్లో రూ.199, రూ.499, రూ.999 విలువైన నిత్యావసర సరుకుల ప్యాక్‌లు విక్రయించనున్నారు. ఈ ప్యాక్‌లో పసుపు , మసాలా పొడి, పిండి పదార్థాలు, నూనె తదితరాలను సహకార సంఘాల ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని అధికారులకు సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

### సూళ్లూరుపేట, నెల్లూరు మెము రైళ్ల వేళల్లో మార్పులు

పెరంబూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మూర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి బయల్దేరే మెము రైళ్లలో మార్పులు చేసినట్టు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ● మూర్ మార్కెట్ కాంప్లెక్స్-సూళ్లూరుపేట మెము తెల్లవారుజామున 5.15 గంటలకు బదులు 5.40 గంటలకు బయల్దేరుతుంది. ● నెల్లూరు-సూళ్లూరుపేట మెము ఉదయం 10.05 గంటలకు బదులు 10.30 గంటలకు బయల్దేరుతుంది. ● మూర్ మార్కెట్ కాంప్లెక్స్-గుమ్మిడిపూండి సబర్బన్ రైలు తెల్లవారుజామున 5.40కు బదులు 5.20 గంటలకు బయల్దేరుతుందని, ఈ మార్పు మంగళవారం నుంచి అమలుకు వచ్చిందని దక్షిణ రైల్వే తెలిపింది.

### 21 నుండి సీనియర్ సిటిజన్లకు బస్‌పాస్ టోకెన్లు

పెరంబూర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్లకు ఈ నెల 21 నుంచి ఉచిత బస్‌పాస్ టోకెన్లు ఇవ్వనున్నారు. నగరంలో నడుపుతున్న ఎంటీసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్లు ఉచితంగా ప్రయాణించేందుకు నెలకు 10 టోకెన్లు ఇస్తుంటారు. ఈ టోకెన్లు ఆరు నెలలకు ఒకసారి అందజేస్తుంటారు. ఆ ప్రకారం, 2025 జనవరి నుంచి జూన్ వరకు టోకెన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంటీసీ తెలిపింది. ఎంటీసీ డిపోలు, బస్టాండ్లు మొత్తం 40 ప్రాంతాల్లో ఈ నెల 21 నుంచి 31వ తేది వరకు ఉదయం 8 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఈ టోకెన్లు అందజేయనున్నారు.

### ఈబీ వెబ్‌సైట్ మార్పు

పెరంబూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ బోర్డు ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల చెల్లింపు, కొత్త కనెక్షన్, కనెక్షన్ల పేరు మార్పు సహా విద్యుత్ బోర్డుకు సంబంధించిన అన్ని సేవలు www. tangedco.org అనే వెబ్‌సైట్ ద్వారా నమోదుచేసుకుంటుంటారు. ఈ క్రమంలో, తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్, తమిళనాడు పవర్ జనరేషన్ కార్పొరేషన్, తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్లుగా విభజించారు. ఈ విభజనకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల డైరెక్టరేట్ అనుమతివ్వడంతో, రెండు సంస్థలు వేర్వేరుగా పనిచేస్తున్నాయి. దీంతో, రాష్ట్ర విద్యుత్ బోర్డు వెబ్‌సైట్ www. tnpdcl.orgగా మార్పుచేశారు. వినియోగదారులు ఇక నుంచి ఈ వెబ్‌సైట్ వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు.

# బైక్ ట్యాక్సీలను రద్దు చేయండి

## కోవైలో ఆటోడ్రైవర్ల ధర్నా





ప్రసంగిస్తున్న కార్మికసంఘం నేతలు - ధర్నాలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

చెన్నై, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బైక్‌టాక్సీలు నడిపేందుకు రవాణా శాఖ ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని, దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆటో మీటర్ ఛార్జీలను పెంచాలని కోరుతూ వాణిజ్యనగరం కోయంబత్తూరులో మంగళవారం ఉదయం ఆటో డ్రైవర్లు మహాధర్నా నిర్వహించారు. కోయంబత్తూరు ఉక్కడం బస్‌స్టేషన్ సమీపంలో జిల్లా ఆటో కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బైక్ టాక్సీల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్లు ధర్నా చేశారు. ఈ ధర్నాకు కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షుడు సెల్వం, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి శివాజీ నాయకత్వం వహించారు. అన్నాడీఎంకే కార్మిక సంఘం, ఇతర కార్మిక సంఘాలకు చెందిన సుమారు 400 మందికిపైగా ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బైక్ టాక్సీలకు ఇచ్చిన అనుమతి రద్దు చేసి, ఆటో మీటర్ ఛార్జీలను పెంచకపోతే తమ ఆందోళన తీవ్రతరం చేస్తామని కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు.

## నాణ్యత లేని 90 మందులు

పెరంబూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో విక్రయిస్తున్న అన్ని మందుల నమూనాలను కేంద్ర, రాష్ట్ర మందుల నాణ్యత నియంత్రణ బోర్డు ద్వారా పరిశీలిస్తుంటారు. అందులో నాణ్యత లేని మందుల సంస్థలపై చర్యలు చేపడుతుంటారు. గత నెలలో వెయ్యి మందులను పరిశీలించగా, వాటిలో జీర్ణవ్యవస్థ దెబ్బతినడం, జలుబు, విటమిన్ లోపం తదితరాలకు వినియోగించే 90 మందులు నాణ్యత లేనివిగా గుర్తించారు. ఈ వివరాలు https://cdsco.gov.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

## 3 కోట్ల స్మార్ట్ మీటర్లు కేటాయింపు

● కేంద్రమంత్రి శ్రీపద్ నాయక్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు 3 కోట్ల స్మార్ట్ మీటర్లు కేటాయించినట్లు రాజ్యసభలో కేంద్ర సహాయ మంత్రి శ్రీపద్ నాయక్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్రానికి చెందిన ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా 2025వ సంవత్సరంలోగా 25 కోట్ల స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించామన్నారు. తమిళనాడుకు 3 కోట్ల స్మార్ట్ మీటర్లు కేటాయించామని తెలిపారు.

## ఘనంగా నరసింహనగర్ తెలుగు బాపిస్టు సంఘ వార్షికోత్సవం



సండే స్కూల్ చిన్నారులతో అతిథులు, నిర్వాహకులు

ప్యారీస్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పులియన్ తోప్, నరసింహనగర్ కెనాల్ తెలుగు బాపిస్టు సంఘం (ఎన్టీబీసీ) 50వ వార్షికోత్సవం ఇటీవల జరిగింది. మద్రాసు సెంటినరీ తెలుగు బాపిస్టు సంఘ కాపరి రెవ, డా. ఎస్ రాజేంద్రప్రసాద్ ప్రార్థనతో ప్రారంభమైన ఈ వేడుకల్లో ఆసియా బాపిస్టు కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు రెవ, డా. ఎస్ ప్రకాశ్ రాజ్ దైవసందేశం అందించారు. అనంతరం ఎన్టీబీసీ కాపరి రెవ, వి.యేసుదాసు సంఘం తరుపున చేపడుతున్న సామాజిక, ఆధ్యాత్మిక సేవల గురించి వివరించారు. సంఘ అధ్యక్షుడు పీకే బాబు కొండయ్య 50వ వార్షికోత్సవానికి సహాయ సహకారాలు అందిస్తున్న వారికి ధన్యవాదాలు తెలిపారు. సంఘ కార్యదర్శి గంగేపోగు బాబూ రావు, కోశాధికారి జి.షడ్రక్, సంఘ పెద్దలు, సండే స్కూల్ చిన్నారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్త్రీల సమాజం సభ్యులు క్రిస్మస్‌ను ఆహ్వానిస్తూ గీతాలను ఆలాపించారు.

## నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ముట్టడి

పెరంబూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ఆధ్వర్యంలో బుధవారం రాజ్‌భవన్ ముట్టడి చేపట్టనున్నారు. ఈ మేరకు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై విడుదల చేసిన ప్రకటనలో... పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పార్టీలు, అదానీపై అవినీతి ఆరోపణలు, మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి, బాధిత ప్రజలను ప్రధాన మంత్రి పరామర్శించాలని సహా అంశాలపై రాజ్యసభ, లోక్‌సభలో ప్రశ్నలు లేవనెత్తినా కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అవినీతి, నిరుద్యోగం, రైతుల ఆందోళన తదితరాలపై చర్చించాలని ఇండియా కూటమి కోరుతున్న నేపథ్యంలో, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిరాకరిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం ఉదయం 10 గంటలకు సైదాపేట పనగల్ మాలిగై నుంచి తన నేతృత్వంలో శాసనసభపక్ష కాంగ్రెస్ నేత రాజేష్‌కుమార్ నేతృత్వంలో రాజ్‌భవన్ ముట్టడి చేపట్టనున్నట్లు సెల్వపెరుందగై తెలిపారు.

## నేడు 'నవరస నట శిఖామణి' దృశ్య శ్రవణ మాలిక ప్రదర్శన

చెన్నై, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కన్యకా పరమేశ్వరి కళాశాలలోని ఐక్యూఏసీ, సృజన తెలుగు భాషా మండలి, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి యువ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సూర్యకాంతం వర్ధంతి సందర్భంగా విద్యార్థులు రూపొందించిన 'నవరస నట శిఖామణి' దృశ్యశ్రవణ మాళిక ప్రదర్శన బుధవారం జరుగనుంది. ప్యారీస్‌లోని ఎస్‌కేపీసీ ఆడిటోరియంలో మధ్యాహ్నం ఒంటి గంటకు జరుగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ నటి కుట్టి పద్మిని, తెలుగు సినీ చరిత్రకారుడు ఎస్వీ రామారావు, ఆత్మీయ అతిథులుగా అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి అధ్యక్షులు అజంతా శంకరరావు, సూర్యకాంతం కుమారుడు,కోడలు డాక్టర్ అనంత పద్మనాభమూర్తి, ఈశ్వరీ రాణి, ప్రముఖ హాస్య రచయిత్రి జోస్యుల ఉమ హాజరుకానున్నారు.

## దివంగత మాజీ ఎమ్మెల్యేకు ఘననివాళి



ఎమ్మెల్యే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

తిరుత్తణి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే ఎ.ఏకాంబర రెడ్డియార్ 25వ వర్ధంతిని ఆయన మద్దతుదారులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పళ్లిపట్టు బజారు వీధిలోని గాంధీ విగ్రహం వద్ద ఉంచిన ఏకాంబర రెడ్డియార్ చిత్రపటానికి పుర ప్రముఖులు నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఏఈ ఉమాపతి, వెంకటరాజు, రాజేంద్ర నాయుడు, చిన్నప్పన్ చెట్టి, జయవేలు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ బాటిళ్లలో పాలు విక్రయాలు

● పరిశీలించాలని ఆవిన్‌కు ట్రిబ్యునల్ ఉత్తర్వులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మళ్లీ మళ్లీ శుభ్రం చేసుకొని వినియోగించేలా ప్లాస్టిక్ బాటిళ్లలో పాల విక్రయాలు చేపట్టడంపై పరిశీలించాలని ఆవిన్ సంస్థకు దక్షిణ మండల గ్రీన్ ట్రిబ్యునల్ సూచించింది. రాష్ట్రంలో పాలు, పెరుగు, వెన్న, నెయ్యి తదితర పాల ఉత్పత్తులు ప్లాస్టిక్ సంచులు, డబ్బాల్లో విక్రయిస్తున్నారు. ఈ సంచులు విసిరివేయడం వల్ల పర్యావరణ కాలుష్యం, మానవులు, జంతువులకు హాని కలుగుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల, పర్యావరణానికి హాని కలిగించని గాజు సీసాలు, టెట్రా ప్యాక్‌లో పాలు విక్రయించేలా ఆవిన్ సంస్థను ఆదేశించాలని నగరానికి చెందిన సురేంద్ర నాథ్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రాగా ఆవిన్ సంస్థ తరపున... ప్లాస్టిక్, సీసాల బాటిళ్లలో విక్రయాలు చేపడితే అందుకు సంబంధించి వ్యయం ఎక్కువ అవుతుందని, దానికోసం కోట్ల విలువైన యంత్రాలు కొనుగోలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాది... ఆవిన్ సంస్థ మాత్రమే ఇతర సంస్థల కంటే తక్కువ ధరకు పాలు విక్రయిస్తోందని తెలిపారు. బాటిళ్లలో విక్రయిస్తే ధర పెరిగి ప్రజలు ఇబ్బందిపడతారని, అదే సమయంలో ప్రైవేటు సంస్థలు ప్లాస్టిక్ సంచుల్లోనే పాలు విక్రయిస్తున్నారని వివరించారు. ఇరుతరపు వాదనల అనంతరం ట్రిబ్యునల్ న్యాయమూర్తి పుష్ప సత్యనారాయణ, సభ్యులు సత్యగోపాల్ మళ్లీ మళ్లీ వినియోగించే ప్లాస్టిక్ బాటిళ్లలో పాలు విక్రయించడంపై, ఆవిన్ సంస్థ ప్రాథమికంగా పరిశీలించాలన్నారు. ప్రైవేటు సంస్థలకు మార్గదర్శకంగా ఆవిన్ సంస్థ ఇలాంటి చర్యలు చేపట్టవచ్చని పేర్కొన్న ట్రిబ్యునల్, తదుపరి విచారణ జనవరి 4వ తేదీకి వాయిదా వేసింది.

## సంజీవి కొండపై మార్గళి మెట్ల పూజ



మెట్లకు పసుపు, కుంకుమ రాస్తున్న భక్తులు

పెరంబూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా రాజపాళయంలో మార్గళి మాసం సందర్భంగా సంజీవి కొండపై మెట్ల పూజ నిర్వహించారు. సంజీవి కొండపై వెలసిన కుమారస్వామి ఆలయ ప్రధాన ఉత్సవాల్లో మెట్ల పూజ ఒకటి. ఈ ఆలయానికి వెళ్లేందరు 365 మెట్లు ఎక్కాల్సి ఉంది. మార్గళి మాసం ఉత్సవాల్లో భాగంగా భక్తులు భజన పాటలు పాడుతూ, ఒక్కో మెట్టుకు పసుపు, కుంకుమ రాస్తూ, 10 మెట్లకు ఒక టెంకాయ, పండు ఉంచి పూజలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు నిర్వహించారు.

## వాల్పారై కళాశాల రోడ్డులో చిరుత వాకింగ్



కళాశాల రోడ్డులో సంచరిస్తున్న చిరుత

పెరంబూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా వాల్పారై ప్రభుత్వ కళాశాల రోడ్డులో చిరుత పులి సంచరించే సీసీ టీవీ దృశ్యాలు విద్యార్థులు, తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వాల్పారై, చుట్టుపక్కల గ్రామాల్లో కొద్ది రోజులుగా వన్యమృగాల సంచారం అధికమవుతోంది. ఈ నేపథ్యంలో, మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు కళాశాల రోడ్డులో చిరుత సంచరించింది. ఈ సమయంలో ఆ ప్రాంతంలో వాకింగ్‌కు వెళ్లిన కొందరు, చిరుతను చూసి భయాందోళనకు గురై సమీపంలోని దుకాణాలపై ఎక్కి తప్పించుకున్నారు. వారిలో కొందరు చిరుత సంచరించే దృశ్యాలు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అలాగే, ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల్లో కూడా చిరుత సంచారం దృశ్యాలు నమోదయ్యాయి. ఈ విషయమై అటవీ శాఖ అధికారులు విచారిస్తున్నారు.

## పెళ్లి పేరుతో యువకుల వద్ద మోసం


● ముగ్గురు మహిళల సహా ఏడుగురి అరెస్టు



విజయ, కాళీశ్వరి, అరుణా దేవి

ప్యారీస్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకునేందుకు అమ్మాయిలను వెతుకుతున్న యువకుల నుంచి నగలు, నగదు వసూలు చేసి మోసం చేసిన ముగ్గురు మహిళలు సహా ఏడుగురిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మదురై జిల్లా ఉసిలంపట్టి సమీపంలోని బూదిపురం గ్రామానికి చెందిన పెరుమాయ్ అనే వృద్ధురాలు తన కుమారుడు మురుగన్‌కు వివాహం చేయాలని నిర్ణయించింది. వధువును వెతికే బాధ్యతను ఓ మ్యారేజీ బ్రోకర్‌కు అప్పగించింది. ఈ విషయం తెలుసుకున్న పొల్లాచ్చికి చెందిన విజయ అనే మహిళా బ్రోకర్, పెరుమాయ్‌ను కలిసి తన దగ్గర వధువులకు సంబంధించిన ఫొటోలు, వివరాలున్నాయని నమ్మించి ఆమె వద్ద కమీషన్‌గా రూ.1.30 లక్షలు తీసుకుని వెళ్లిపోయింది. రోజులు గడిచినా వధువుకు సంబంధించి ఎలాంటి సమాధానం రాకపోవడంతో విజయపై అనుమానంతో ఉసిలంపట్టి పోలీసులను పెరుమాయి ఆశ్రయించింది. కేసునమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి ఎట్టకేలకు పెళ్లిళ్ల బ్రోకర్ విజయను అరెస్టు చేశారు. ఆమె ఇచ్చిన సమాచారం మేరకు పెళ్లి పేరుతో పలువురు యువకులను మోసం చేసిన తూత్తుకుడికి చెందిన కాళీశ్వరి, అరుప్పుకోటకు చెందిన అరుణాదేవిని కూడా అరెస్టు చేశారు. ఈ ముగ్గురు మహిళలకు సహకరించిన తిరుపూర్ శ్రీనివాసన్, జయభారతి, సుచిత్ర, మురళీధరన్ అనే వారిని కూడా అరెస్టు చేసి సోమవారం కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

## అన్నామలై కొండపై తప్పిపోయిన మహిళ సురక్షితం



కొండపై నుంచి మహిళను మోసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది - కొండపై తప్పిపోయిన మహిళ

వేలూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి తిరువణ్ణామలై కొండమీదకు వెళ్లి తప్పిపోయిన ఆంధ్రా మహిళను అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ కార్తీక దీపోత్సవాల్లో భాగంగా ఈనెల 13న అన్నామలై కొండపై మహాదీపం వెలిగించారు. అదే సమయంలో, ఫెంగల్ తుఫాన్ కారణంగా ప్రమాదం జరిగడంతో నిపుణుల నివేదిక ఆధారంగా ఈ ఏడాది అన్నామలై కొండ పైకి భక్తులకు అనుమతించలేదు. ఈ నేపథ్యంలో, ఆదివారం అన్నామలై కొండపైకి ఆంధ్ర రాష్ట్రానికి చెందిన ఓ మహిళ సహా ఇద్దరు ఎక్కగా, వారిలో ఓ వ్యక్తి కొండ కిందకు చేరుకున్నాడు. కిందకు దిగే సమయంలో దారి తెలియక ఓ మహిళ కొండల్లో చిక్కుకుపోయింది. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, ఓ ఆధ్యాత్మిక సంస్థ సహాయంతో అడవిలో గాలించి ఆ మహిళను సురక్షితంగా కిందకు తీసుకొచ్చారు. రాత్రంతా నీరు, ఆహారం లేకపోవడంతో నీరసించిన ఆ మహిళను తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

### గంజాయి కేసు విచారణకు గైర్హాజరు

## సవుక్కు శంకర్‌కు అరెస్టు వారెంట్



చెన్నై, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి స్వాధీనం కేసు విచారణకు హాజరుకాని వివాదాస్పద యూట్యూబర్ సవుక్కు శంకర్‌కు కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. సవుక్కు శంకర్ కొన్ని నెలల క్రితం మహిళా పోలీసులను, పోలీసు ఉన్నతాధికారులను కించపరిచేలా విమర్శలు చేయటంతో కోవై పోలీసులు కేసునమోదు చేసి అరెస్టు చేశారు. అదే సమయంలో తేనిలో ఆయన బసచేస్తున్నప్పుడు 2.5 కేజీల గంజాయి ఉంచారని పళనిచెట్టిపట్టి పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఈ కేసులోను ఆయన అరెస్టయ్యారు. గంజాయి స్వాధీనం సంఘటనకు సంబంధించిన కేసు విచారణ మదురై మాదక ద్రవ్యానిరోధక విభాగం ప్రత్యేక కోర్టులో జరిగింది. రెండు మూడు పర్యాయాలకు పైగా ఈ కేసు విచారణకు సవుక్కు శంకర్ హాజరుకాలేదు. దీంతో మంగళవారం కేసును విచారించిన మేజిస్ట్రేట్ సెంగమల సెల్వన్ నిందితుడు సవుక్కు శంకర్‌ను అరెస్టు చేసి తమ ఎదుట హాజరు పరచాలంటూ అరెస్టు వారెంట్ జారీ చేశారు.

**చెన్నైలో అరెస్టు... :** మదురై కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసిన కొద్ది గంటలలోపే సవుక్కు శంకర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నైలో ఉన్న ఆయనను పోలీసులు అరెస్టు చేసి తేనాంపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం శంకర్ వద్ద పోలీసులు తీవ్ర విచారణ జరుపుతున్నారు.

## తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా ముల్లంపట్టిలో తేనెటీగల దాడిలో పెరియస్వామి (45) మృతిచెందాడు. వలర్మతికి చెందిన తోటలో చెట్ల నుంచి తాటి ఆకులు నరికేందుకు ఇద్దరు మహిళలు సహా ముగ్గురు పాల్గొన్నారు. ఓ చెట్టు ఆకులు నరికే క్రమంలో కొండ తేనెటీగలు బయటక వచ్చాయి. ఈ తేనెటీగలు సమీపంలో బస్టాండ్‌లో నిల్చొన్న పెరియస్వామిపై దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. చుట్టుపక్కల వారు అతనిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు.

## వేలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణి మృతి

ప్యారీస్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అనిత అనే యువతి మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే తిరువణ్ణామలై జిల్లా ఆరణి మండలం ఇరుంపేట గ్రామానికి చెందిన అనిత(24) భర్త కోటేశ్వరన్ ఆవడి బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఇది ఇలా ఉండగా ఈ నెల 12వ తేదీ అనితను ప్రసవం కోసం వేలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం చికిత్స జరుగుతుండగా కడుపులోని బిడ్డ మృతిచెందగా, గంట వ్యవధిలోనే ఆపరేషన్ వికటించి అనిత కూడా మృతిచెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు వేలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇద్దరు వలస కార్మికుల హత్య

ప్యారీస్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా వెప్పడి ప్రాంతంలో ఓ స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు కార్మికులు హత్యకు గురైన సంఘటనపై పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. కుమారపాళయం సమీపంలోని వెప్పడి ప్రాంతం, పరిసర ప్రాంతాల్లో 30కి పైగా ఉన్న స్పిన్నింగ్ మిల్లుల్లో గుజరాత్, బిహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, ఛతీస్‌ఘడ్, తదితర రాష్ట్రాల కార్మికులు పనిచేస్తున్నారు. వెప్పడి ప్రాంతంలోని స్పిన్నింగ్ మిల్లు కార్మికులు ఓబులేష్, మున్నా అనే వారు రాళ్ల దాడిలో తీవ్రంగా గాయపడి మృతిచెందినట్లు మంగళవారం పోలీసులకు సమాచారం అందింది. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. అనంతరం స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్న ఉత్తరాది కార్మికుల వద్ద విచారణ జరిపారు.

## నీటమునిగి 90 మేకల మృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా అయక్కుడి సమీపం కంబలి గ్రామంలో హఠాత్తుగా కురిసిన వర్షాలతో నీటమునిగి 90 మేకలు మృతిచెందాయి. కంబలి గ్రామానికి చెందిన కృష్ణస్వామి తన తోటలో 90 మేకలను పెంచుతున్నాడు. కొద్దిరోజులుగా కురిసిన వర్షాల కారణంగా తోటలో భారీగా నీరు చేరింది. ఈ నీటిలో చిక్కుకొని 90 మేకలు మృతిచెందాయి. సమచారం అందుకున్న మున్సిపల్ ఉద్యోగులు వెటర్నరీ వైద్యులతో మేకలకు పోస్టుమార్టం నిర్వహించి, అదే ప్రాంతంలో పూడ్చివేశారు.

## రాష్ట్రంలో 77 రైల్వేస్టేషన్ల స్థాయి పెంపు

● డీఎంకే ఎంపీ కనిమొళి ప్రశ్నకు కేంద్రం సమాధానం

పెరంబూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో 'అమృత్ భారత్ స్టేషన్' పథకం అమలవుతోందని, ఇందులో 77 రైల్వేస్టేషన్లు స్థాయి పెంచాలని నిర్ణయించి, 71 స్టేషన్లలో పనులు జరుగుతున్నాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలిపారు. పార్లమెంటు సమావేశాల్లో డీఎంకే ఎంపీ కనిమొళి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. తమిళనాడులో 77 రైల్వేస్టేషన్ల స్థాయి పెంచాలని నిర్ణయించామన్నారు. మదురై, ఎగ్మూర్ రైల్వే స్టేషన్లలో బహుళ అంతస్తుల పార్కింగ్, రామేశ్వరంలో ప్రవేశ ద్వారం, పార్శిల్ కార్యాలయాల ఆధునీకరణ, ఎగ్మూర్‌లో కొత్త పార్శిల్ కార్యాలయం, కారైక్కుడిలో కొత్తగా ప్రయాణికుల విశ్రాంతి గది, లిఫ్ట్ సౌకర్యం, అరియలూరు, మన్నార్‌కుడి రైల్వేస్టేషన్లలో కొత్త ప్రవేశద్వారాల నిర్మాణం తదితర పనులు జరుగుతున్నాయని తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో నాలుగేళ్లలో రూ.4,313 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు రూ.2,506 కోట్లు ఖర్చుచేసినట్లు కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు.

## ప్రభుత్వ సహాయ న్యాయవాదుల పరీక్ష రద్దు

పెరంబూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో నిర్వహించిన ప్రభుత్వ సహాయ న్యాయవాదుల పోస్టుల భర్తీకి నిర్వహించిన రాతపరీక్ష రద్దు చేస్తున్న ప్రకటించిన టీఎన్‌పీఎస్సీ, ఈ నెల 22న మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ విషయమై టీఎన్‌పీఎస్సీ విడుదల చేసిన ప్రకటనలో... ప్రభుత్వ సహాయ న్యాయవాదుల పోస్టుల భర్తీకి ఈ నెల 14న ఆన్‌లైన్ ద్వారా రాతపరీక్ష నిర్వహించామన్నారు. కానీ, సాంకేతికలోపం కారణంగా పలువురు పరీక్ష సరిగా రాయలేదని ఫిర్యాదు చేశారన్నారు. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 14న నిర్వహించిన పరీక్ష రద్దు చేశామని తెలిపింది. అదే సమయంలో ఈ నెల 22న మళ్లీ ఈ పరీక్షను ఆన్‌లైన్ ద్వారా కాకుండా ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు, అభ్యర్థులు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రకటనలో తెలిపింది.

## కుశస్థలి నదిలో కొట్టుకుపోయిన వ్యక్తి

● కాపాడిన పోలీసులు, యువత

నగరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):చిత్తూరు జిల్లా నగరి సమీపంలోని కుశస్థలి నదిలో కొట్టుకుపోయిన తమిళనాడువాసిని స్థానిక యువతతో కలిసి పోలీసులు కాపాడారు. నగరి - కీళపట్టు మధ్య కుశస్థలీ నదిలో మంగళవారం నీటి ప్రవాహం ఉధ్రుతంగా ఉంది. ఇక్కడ వంతెనపై నీటి ప్రవాహం కొనసాగుతోంది. మధ్యాహ్నం సమయంలో కొళత్తూరుకు చెందిన చిట్టిబాబు తన ద్విచక్ర వాహనంపై ఈ వంతెన దాటడానికి ప్రయత్నించి, నీటి ప్రవాహానికి నదిలోపడి కొట్టుకుపోయాడు. స్థానిక యువత గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అందరూ కలిసి తాడు సాయంతో అతడిని కాపాడారు.

### కోర్టుకు హాజరైన

## మాజీ మంత్రి కేసీ మణి

అడయార్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు ప్రమాణ పత్రం సమర్పించిన కేసులో అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి కేసీ మణి మంగళవారం తిరుపత్తూరు కోర్టుకు హాజరయ్యారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థిగా జోలార్‌పేట అసెంబ్లీ స్థానం నుంచి ఆయన పోటీ చేశారు. ఆ సమయంలో తన ఆస్తుల వివరాలకు సంబంధించి ఆయన తప్పుడు ప్రమాణ పత్రం సమర్పించారని వేలూరు జిల్లాకు చెందిన రామ్మూర్తి అనే వ్యక్తి మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు... ప్రమాణ పత్రాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దీంతో ప్రజాప్రాతినిధ్య చట్టం 125 ఏ సెక్షన్ కింద ఎన్నికల సంఘం ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఈ కేసు విచారణ తిరుపత్తూరు కోర్టులో సాగుతుంది. ఇందులోభాగంగా గత నెల 26వ తేదీ విచారణకు రాగా, కేసీ మణి హాజరుకాలేదు. దీంతో ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసు మంగళవారం విచారణకు రావడంతో మాజీ మంత్రి కోర్టుకు హాజరుకాగా, తదుపరి విచారణ జనవరి 6వ తేదీకి వాయిదా వేశారు.

# 'విలన్'గా నటించాలని ఉంది



● కరుణాకరన్

తనకు ప్రతినాయకుడిగా నటించాలని ఉందని ప్రముఖ నటుడు కరుణాకరన్ అంటున్నారు. ఆయన నటించిన రెండు చిత్రాలు ఇటీవల విడుదలయ్యాయి. వీటిలో ఒకటి సిద్ధార్థ్ హీరోగా నటించిన 'మిస్ యూ' కాగా, రెండోది మిర్చి శివ హీరోగా నటించిన 'సూదు కవ్వుం-2'. ఆ రెండు సినిమాల్లో కరుణాకరన్ కీలక పాత్రలు పోషించి మరోమారు ప్రేక్షకులతో శెభాష్ అని పించుకున్నారు. ముఖ్యంగా 'మిస్ యూ' సినిమాలో తన సహజసిద్ధమైన నటన ప్రదర్శించి మరో అడుగు ముందుకేశారు. ఈ సినిమాలో కంటే 'సూదు కవ్వుం-2'లో మరింత మెరుగైన నటనతో ప్రేక్షకులను ఆలరిస్తున్నారు. ఇందులో రాజకీయ నేత (మంత్రి)గా నటించిన కరుణాకరన్.. సినిమా మొత్తాన్ని తన భుజాలపై మోశారంటూ ప్రశంసిస్తున్నారు. తన స్నేహితుడు, దర్శకుడు నలన్ కుమారస్వామి ద్వారా షార్ట్‌ఫిల్మ్‌లో తొలిసారి కనిపించారు. ఆ తర్వాత దర్శకుడు సుందర్ తొలిసారి సినిమా అవకాశం ఇచ్చినప్పటికీ 2012లో కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో వచ్చిన 'పిజ్జా'లో విజయ్ సేతుపతి స్నేహితుడిగా కరుణాకరన్ నటించారు. ఇది ఆయన కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి కోలీవుడ్‌లో తనకుంటూ ఓ ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన విడుదలైన ఈ రెండు చిత్రాలు ఘన విజయం సాధించడంతో కరుణాకరన్ హర్షం వ్యక్తం చేస్తూ, 'ఇప్పటివరకు అన్ని రకాల పాత్రలు పోషించాను. వీటిలో ఎన్నో మంచి పాత్రలు ఉన్నాయి. కమెడియన్‌గా కూడా కొత్తగా నన్ను నేను నిరూపించుకోవాల్సింది ప్రత్యేకించి ఏమీలేదు. కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటి వరకు హార్డ్‌వర్క్ చేస్తూనే ఉన్నాను. అయితే, నాలో చిన్న అసంతృప్తి ఉంది. ప్రతినాయకుడిగా నటించాలని ఉంది. ఇలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను. విలన్‌గా అవకాశం వస్తే మాత్రం వదులుకోను. ఒక్క చిత్రంలోనైనా విలన్‌గా నటించి నన్ను నేను నిరూపించుకోవాలని వుంది' అన్నారు.

# నేడు దర్శకుడు బాలకు సన్మానం



● 'వణంగాన్' ఆడియో విడుదల

తమిళ చిత్రపరిశ్రమలో తన టేకింగ్, మేకింగ్‌తో ప్రత్యేక గుర్తింపు, ఇమేజ్ సొంతం చేసుకున్న దర్శకుడు బాల. ఈయన చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి 25 యేళ్ళు పూర్తి చేసుకున్నారు. దీన్ని పురస్కరించుకుని ఆయనను బుధవారం ఘనంగా సన్మానించనున్నారు. ఇందుకోసం నందంబాక్కంలోని చెన్నై ట్రేడ్ సెంటరులో భారీ స్థాయిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే, బాల తాజాగా దర్శకత్వం వహించిన 'వణంగాన్' చిత్ర ఆడియో, ట్రైలర్ కూడా రిలీజ్ చేయనున్నారు. బి స్టూడియోస్ సహకారంతో వి హౌస్ పతాకంపై నిర్మాత సురేష్ కామాక్షి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించారు. యూఏ సర్టిఫికెట్ పొందిన ఈ చిత్రం పొంగల్ కానుకగా జనవరి 10వ తేదీ విడుదల చేస్తున్నారు.

'వణంగాన్'లో అరుణ్ విజయ్

# ధనుష్ హీరోగా 'చంద్రబాబు' బయోపిక్!



గత 60, 70 దశకంలో నటుడుగా, కమెడియన్‌గా, దర్శకుడిగా, నేపథ్యగాయకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన నటుడు చంద్రబాబు. దివంగత మహానటులైన ఎంజీఆర్, శివాజీ గణేశ్‌లకు దీటుగా నటించారు. ఆ కాలంలోనే గ్రీన్‌వేస్ రోడ్డులో 20 ఎకరాల్లో ఇల్లు నిర్మించి, ఆ ఇంటి మొదటి అంతస్తులోకి నేరుగా తన కారు వెళ్ళి పార్కింగ్ చేసేలా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఎంజీఆర్ హీరోగా 'మాడి వీట్టు ఏళై' అనే చిత్రాన్ని చంద్రబాబు స్వీయ నిర్మాణంలో ప్రారంభించగా, అది అర్థాంతరంగా ఆగిపోయింది. దీంతో ఆయన ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. అదేసమయంలో 1974లో ఆయన తుదిశ్వాస విడిచారు. కోలీవుడ్ గొప్ప నటుల్లో ఒకరిగా గుర్తింపు పొందిన చంద్రబాబు బయోపిక్ తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో హీరోగా ధనుష్ నటించనున్నట్టు సమాచారం. ధనుష్ స్వయంగా నిర్మించడమే కాకుండా, చంద్రబాబు పాత్రలో నటించాలని భావిస్తూ, చంద్రబాబు కుటుంబ సభ్యుల అనుమతి కోరినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఇప్పటికే ఇసైజ్ఞాని ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్ నటిస్తున్న విషయం తెల్సిందే.

# సూరి హీరోగా 'మామన్'



సూరి, ఐశ్వర్య లక్ష్మి

చిత్రజ్యోతి

కమెడియన్ సూరి హీరోగా నటించే మరో చిత్రం పూజా కార్యక్రమంతో నగరంలో ప్రారంభమైంది. 'మామన్' అనే టైటిల్ ఖరారు చేసిన ఈ సినిమాలో కథానాయికగా ఐశ్వర్య లక్ష్మిని ఎంపిక చేశారు. మరో కీలక పాత్రలో వెటరన్ నటుడు రాజ్‌కిరణ్ నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ సోమవారం పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. అన్ని అంశాల మేళవింపుతో కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించనున్నారు. 'విలంగు' వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న ప్రశాంత్ పాండిరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. లార్క్ స్టూడియోస్ పతాకంపై కె.కుమార్ నిర్మించే ఈ మూవీకి సంగీతం అబ్దుల్ వహాబ్. ఇదిలావుండగా కమెడియన్ సూరి 'విడుదలై'తో హీరోగా మారారు. ఈ చిత్రం ఘన విజయం సాధించడంతో ఆ తర్వాత వరుస చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన నటించిన 'విడుదలై' రెండో భాగం ఈ నెల 20వ తేదీన రిలీజ్‌కానుంది. ఈ చిత్రానికి సెన్సార్ కమిటీ 'ఏ' సర్టిఫికెట్‌ను మంజూరు చేసింది.

# అన్నాసాలైలో రూ.5.60 కోట్లతో కో-ఆప్టెక్స్ షోరూమ్



కో-ఆప్టెక్స్ షోరూమ్ ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

● ప్రారంభించిన డిప్యూటీ సీఎం

చెన్నై, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలైలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహానికి ఎదురుగా రూ.5.60 కోట్లతో నిర్మించిన కో-ఆప్టెక్స్ కోలమ్ షోరూమ్‌ను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి మంగళవారం ప్రారంభించారు. నాలుగు అంతస్థులతో లిఫ్ట్ సదుపాయంతో, వాహనాల పార్కింగ్‌తో ఈ షోరూమ్ నిర్మించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సంక్రాంతి తదితర పండుగల సీజన్లలో రాష్ట్ర ప్రజలంతా కో-ఆప్టెక్స్ దుస్తులు కొనుగోలు చేసి చేనేత కార్మికులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆర్.గాంధీ, పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్ కాసలకు 'విశిష్ట సాహితీ పురస్కారం'



డాక్టర్ కాసల నాగభూషణం

● 22న 'సత్కవితా చతురానన' బిరుదు ప్రదానం

చెన్నై, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, రచయిత, సాహితీ విమర్శకులు డాక్టర్ కాసల నాగభూషణంకు 'విశిష్ట సాహితీ పురస్కారం-2024' అందజేయనున్నట్లు బాపట్ల జిల్లా అద్దంకిలోని పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్టు ప్రకటించింది. అద్దంకిలోని ప్రముఖ సంస్థ 'సాహిత్య కౌముది' పక్షాన తమ తల్లిదండ్రులు పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల సంస్మరణార్థం ఈ పురస్కారంతో పాటు 'సత్కవితా చతురానన' బిరుదు కూడా ప్రదానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మూడు దశాబ్దాలకు పైగా యువతకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు సాహితీ మథనంలో విశేష కృషి చేసి, కవితా శైలితో విమర్శకులను సైతం మెప్పించిన డాక్టర్ కాసలకు ఈ ఏడాది ఈ పురస్కారం వరించింది. ఈ నెల 22న అద్దంకి ఇందిరానగర్ పుట్టంరాజువారి వీధిలో జరుగనున్న ప్రత్యేక కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ కాసలకు ఈ పురస్కారం, బిరుదు ప్రదానం చేయనున్నారు.

# పొన్నై నదిలో గంగా హారతి



హారతులిస్తున్న దృశ్యం

పెరంబూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా నెల్లికుప్పం విశ్వనాధపురంలో పొన్నై నదికి హారతులుచ్చి పూజలు చేశారు. కాశీలో గంగా నదికి ప్రతిరోజు హారతి ఇస్తున్నట్టే నెల్లికుప్పం విశ్వనాధపురంలోని పొన్నై నదిలో రెండేళ్లుగా హారతి ఇస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు విశ్వనాధపురీశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు పొన్నై నదికి గంగా హారతులిచ్చారు.

# నత్తనడకన ఓఎమ్మార్, ఈసీఆర్ పథకం

● స్థలసేకరణలో జాప్యమే కారణమా ?



టి.నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైతో పుదుచ్చేరిని కలిపే రెండు ప్రధాన రహదారుల్లో ఒకటి పాత మహాబలిపురం రోడ్డు (రాజీవ్ గాంధీ రోడ్డు), మరొకటి ఈస్ట్‌కోస్ట్ రోడ్డు. వీటిలో రాజీవ్ గాంధీ రహదారిలో ప్రస్తుతం ఐటీ సంస్థలు, ఎన్నో నివాససముదాయాలున్నాయి. ఈస్ట్‌కోస్ట్‌రోడ్డులోను ఐటీ సంస్థలు, పెద్దపెద్ద రెసిడెన్షియల్ క్వార్టర్స్, రిసార్టులు, పార్కులు, థియేటర్లు, పెద్ద షాపింగ్ మాల్స్ ఉన్న ప్రాంతంగా రూపుదిద్దుకుంది. సరళరేఖలా ఉన్న ఈ రెండు రహదారుల మధ్య బకింగ్‌హామ్ కాలువ ప్రవహిస్తోంది. ఆ కాలువకు ఇరువైపులా ఓఎమ్మార్ (పాత మహాబలిపురం రహదారి), ఈసీఆర్ రోడ్డును ఆనుకుని నివాసాలు న్నాయి. అయినా రెండు రహదారులను కలిపే అనుబంధ రహదారులు చాల తక్కువే. ఈ రెండు రహదారులు చెన్నై తిరువాన్మియూరు ప్రాంతం నుంచే ప్రారంభమవుతున్నాయి. మధ్యలో పెరుంగుడి, చోళింగనల్లూరు, కేలంబాక్కం ప్రాంతాలకు మాత్రమే అనుబంధ రహదారులున్నాయి. బకింగ్‌హామ్ కాలువ దాటేందుకు ఉన్న ఫ్లైఓవర్ వాహనాల రాకపోకలను భరించలేదు.. ఇదిలా ఉండగా చెన్నై క్రోంపేట నుంచి ఈక్కాడు మార్గం గుండా తురైపాక్కం చేరే, రేడియల్ రోడ్డును ఈస్ట్‌కోస్ట్ రోడ్డుతో కలిపే విధంగా తురైపాక్కం జంక్షన్ నుండి ఈస్ట్‌కోస్ట్ రహదారి వరకు బకింగ్‌హామ్ కాలువ మీదుగా కొత్త రహదారిని నిర్మించేందుకు ఓఎమ్మార్ - ఈసీఆర్ లింక్ ప్రాజెక్ట్ రూపొందించారు. ప్రస్తుతం తురైపాక్కం ఓఎమ్మార్ రహదారి నుంచి బకింగ్‌హామ్ కాలువ వరకు రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డును వాకింగ్‌కు వెళ్లే మాత్రమే ఉపయోగించుకుంటున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను ఎందుకో అర్థాంతరంగా నిలిపివేశారు. ఇదిలా ఉండగా ఈ పథకం గురించి చెన్నై మడిపాక్కంకు చెందిన సంఘ సేవకుడు వరదన్ అనంతప్పన్ హైవేస్ శాఖ నుంచి ఆర్టీఐ ద్వారా కొన్ని వివరాలు రాబట్టారు. అందులో ఈ రహదారి పనులను రెండు విడతలుగా చేసేలా ప్రణాళిక రూపొందించారు. మొదటి విడతలో తురైపాక్కం జంక్షన్ నుంచి బకింగ్‌హామ్ కాలువ వరకు అనుబంధ రహదారి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు, తదుపరి ఘట్టం ఈస్ట్‌కోస్ట్ రోడ్డుతో నీలాంగరై ప్రాంతంతో కలిపే అనుబంధ రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ పనులకోసం 2020లో ప్రభుత్వం ఉత్తర్వులివ్వడంతో పాటు రూ.204.20 కోట్లు కూడా కేటాయించింది. మొదటి దశలో ప్రస్తుతం తురైపాక్కం నుంచి బకింగ్‌హామ్ కాలువవరకు అనుబంధ రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. బకింగ్‌హామ్ కాలువపై ఫ్లైఓవర్ నిర్మించాల్సి ఉంది. రెండో దశలో రహదారి నిర్మాణానికి స్థల సేకరణ చేయాల్సి ఉంది. రెండో విడత పనులకు అవసరమయ్యే స్థలాల సేకరణకు రూ.142 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం స్థల సేకరణ పనులు గిండీలోని జాయింట్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో ప్రత్యేక జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో జరుగుతున్నాయని, ఆ పనులు ముగియగానే రహదారి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఓ అధికారి తెలిపారు. అవసరమైనంత నిధులు కేటాయించినా స్థల సేకరణ పూర్తి చేయకపోవడం గర్హనీయమని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ఈ రెండు ప్రధాన రహదారుల అనుబంధ రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## దేశ సాంకేతిక నిపుణుల్లో 20 శాతం తమిళులే

● మంత్రి పళనివేల్ త్యాగరాజన్




కార్యక్రమంలో మంత్రి పళనివేల్ త్యాగరాజన్

చెన్నై, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోని సాంకేతిక నిపుణుల్లో 20 శాతం మంత్రి తమిళనాడువారేనని రాష్ట్ర ఐటీ, డిజిటల్ సేవల మంత్రి డాక్టర్ పళనివేల్ త్యాగరాజన్ పేర్కొన్నారు. మంగళవారం చెన్నైలో జరిగిన 'సీఐఐ కనెక్ట్ 2024'లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. స్థానికుల ప్రతిభ, స్టార్టప్ సపోర్ట్, వ్యూహాత్మక విధానాలతో గ్లోబల్ ఐటీ లీడర్‌గా రాష్ట్రాన్ని రూపొందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ఐటీ రంగంలో 80 శాతం కంటే ఎక్కువమంది స్థానికులున్నారని, చెన్నై, కోవై, మదురై, తిరుచ్చి సేలం సహా అన్ని చోట్లా ఐటీ హబ్‌ల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. ఇక్కడున్న కంపెనీలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వారి వ్యాపారాన్ని సులభతరం చేస్తూ రాష్ట్రాన్ని గ్లోబల్ ఐటీ పవర్ హౌస్‌గా రూపొందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ తమిళనాడు స్టేట్ కౌన్సిల్ వైస్‌ఛైర్మన్ ఏఆర్ ఉన్నికృష్ణన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌నందిని తదితరులు కూడా పాల్గొన్నారు.

## 'ఎబిలిటీ స్పోర్ట్స్ లీగ్' విజేతగా 'చెన్నై లెజెండ్స్'




చెన్నై, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'ఎబిలిటీ స్పోర్ట్స్ లీగ్ టి20' టైటిల్‌ను 'చెన్నై లెజెండ్స్' సొంతం చేసుకుంది. సోమవారం బెంగళూరులో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చెన్నై లెజెండ్స్ 53 పరుగుల తేడాతో బెంగళూరు ఈగల్స్‌ను చిత్తు చేశారు. కన్నడ ప్రభ స్పోర్ట్స్ హెడ్ స్పందన కనియార్, సంయుక్త కర్ణాటక స్పోర్ట్స్ హెడ్ ముకుంద్ శెట్టి, క్రికెటర్ కృష్ణప్ప గౌతం తదితరులు ఫైనల్ మ్యాచ్‌కు హాజరై విజేతలకు ట్రోఫీ బహూకరించారు.

## ఐసీఎఫ్‌కు నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు

అడయార్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరులోని ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) ప్రతిష్ఠాత్మకమైన నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు 2024ను కైవసం చేసుకుంది. ఈ అవార్డును బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) ప్రదానం చేస్తుంది. నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ డే వేడుకల్లో భాగంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యుత్ శాఖామంత్రి మనోహర్ ఖట్టర్, కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి శ్రీపాద్ యస్సో నాయర్, ఐసీఎఫ్ ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సీఆర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు. ఐసీఎఫ్ నూతన ఆవిష్కరణల్లో భాగంగా వందే భారత్ రైళ్లను తయారు చేసింది. ఈ రైళ్ళలో విద్యుత్ ఆదాకుగాను ఐసీఎఫ్‌కు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది.



అవార్డును అందుకుంటున్న దృశ్యం

## సిగ్నల్‌లో సాంకేతిక లోపం

● మార్గమధ్యంలో నిలిచిన రైళ్ళు

అడయార్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా అరక్కోణం సమీపంలో సిగ్నల్‌లో తలెత్తిన సాంకేతికలోపంతో చెన్నై వచ్చే ఎక్స్‌ప్రెస్ రైళ్ళన్నీ మార్గమధ్యంలో ఆగిపోయాయి. కాట్పాడి - చెన్నై మార్గంలో నడిచే అన్ని రైళ్ళు మంగళవారం వేకువజామున 4.40 గంటల సమయంలో నిలిపివేశారు. సాంకేతిక లోపాన్ని అరక్కోణం రైల్వే స్టేషన్ అధికారులకు తెలపడంతో ఇంజనీర్లు వచ్చి లోపాన్ని సరిచేశారు. ఈ కారణంగా అన్ని రైళ్ళు ఓ గంట పాటు ఆలస్యంగా నడిచాయి.

## బైక్ షోరూంలో అగ్నిప్రమాదం

ప్యారీస్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్‌లోని ఎలెక్ట్రిక్ బైక్ షోరూలో సంభవించిన అగ్ని ప్రమాదంలో 28 స్కూటర్లు దగ్ధమయ్యాయి. విరుదునగర్‌లోని ఎన్జీవో కాలనీ ప్రాంతంలోని ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో ఉద్యోగులంతా పని ముగించుకుని వెళ్లగా, సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా షోరూం నుండి మంటలు చెలరేగాయి. గమనించిన చుటుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి, షోరూం యాజమాన్యానికి ఫోన్ చేశారు. ఇంతలో శ్రీరామ్ ఎలక్ట్రిక్స్ దుకాణానికి కూడా ఆ మంటలు వ్యాపించాయి. సమాచారంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది 2 గంటల పాటు శ్రమించి మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో 19 కొత్త ఎలక్ట్రిక్ బైకులు, 9 సర్వీస్‌కి వచ్చిన బైకులు దగ్ధమైనట్లు పోలీసులు తెలిపారు.

## టంగ్‌స్టన్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఆందోళన

అడయార్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా మేలూరు సమీపంలో కేంద్ర ప్రభుత్వం అనుమతించిన టంగ్‌స్టన్ సొరంగ తవ్వకాలకు వ్యతిరేకంగా స్థానికులు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఇందులోభాగంగా అరిట్టాపట్టి సహా పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సోమవారం రాత్రి కొండపైకి ఎక్కి ఆందోళనకు దిగారు. ఈ సొరంగం తవ్వకాల అనుమతులు రద్దుచేస్తున్నట్టు అధికారికంగా వెల్లడించేంత వరకు ప్రతి రోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఆందోళన చేయాలని ఈ గ్రామప్రజలు నిర్ణయించారు. ఇందులోభాగంగా సోమవారం రాత్రి మహిళలు, చిన్నారులు సహా అనేక మంది స్థానికులు కొండ ఎక్కి ఆందోళన చేశారు.

## 21న అన్నాడీఎంకే ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

చెన్నై, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఈ నెల 21న క్రిస్మస్ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ప్రకటించారు. రాష్ట్రంలో మైనారిటీలకు ఎల్లప్పుడూ అండగా ఉండేది అన్నాడీఎంకే అని అన్నారు. 21న పార్టీ తరఫున కీల్పాక్ సీఎస్ఐ లైట్ ఆడిటోరియంలో జరిగే క్రిస్మస్ వేడుకల్లో బిషప్‌లు, పాస్టర్, క్రైస్తవ పెద్దలు, అన్నాడీఎంకే మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, శాసనసభ్యులు పాల్గొంటారని పేర్కొన్నారు.

## లంక చెర నుంచి విముక్తి

● చెన్నై చేరుకున్న 18 మంది జాలర్లు

అడయార్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికా దళం అరెస్టు చేసిన 18 మంది జాలర్లు శ్రీలంక నుంచి నగరానికి విమానంలో చేరుకున్నారు. ఈ నెల 2వ తేదీ నాగపట్టణం, రామేశ్వరం ప్రాంతాలకు చెందిన జాలర్లు సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళారు. వీరంతా చేపలు పడుతుండగా, అంతర్జాతీయ సరిహద్దులను దాటి తమ దేశంల్లోకి ప్రవేశించారంటూ లంక నౌకాదళం అదుపులోకి తీసుకుంది. ఆ తర్వాత కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ జాలర్ల విడుదల కోసం కేంద్రానికి లేఖ రాశారు. దీంతో భారత విదేశాంగ శాఖ జోక్యం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఈ జాలర్లను లంక కోర్టు విడుదల చేయడంతో కొలంబోలోని భారత రాయబార కార్యాలయం ఈ జాలర్లను విమానంలో చెన్నై పంపించింది. వీరికి ఎయిర్‌పోర్టులో మత్స్యశాఖ అధికారులు స్వాగతం పలికి, చెన్నై నుంచి వారివారి స్వస్థలాలకు ప్రత్యేక వాహనాల్లో పంపించారు.

# నెక్సస్ విజయామాల్‌లో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల కోసం నిర్మించిన సెట్టింగ్స్

చెన్నై, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలో నెక్సస్ విజయా మాల్‌లో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆకట్టుకునే 'పోలార్ ఎక్స్‌ప్లోరర్' పేరుతో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆ మాల్‌లో మంచు ప్రాంతం, మంచు శిల్పాలు, మంచుగుహలు ఇలా ఆకర్షణీయమైన సెట్టింగ్‌లు కూడా ఏర్పాటు చేశారు. మై బేబీ పెంగ్విన్ హట్స్, స్నోమేన్ బౌలింగ్, స్నోమేన్ హౌస్, శాంటాక్లాజ్ అంటూ సందర్శకులకు వింత అనుభూతిని కలిగిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు రూ.200ల నుండి రూ.350ల దాకా ప్రవేశ రుసుము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



సచివాలయంలో ప్రముఖ తమిళ రచయిత ఇమయమ్ విరచిత 'కలైంజర్ సృష్టి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించి, తొలి ప్రతిని మంత్రి అన్బిల్ మహేష్‌కు అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్



సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులుగా పదోన్నతి పొందిన ఐఏఎస్ అధికారులు పి.అముదా, అతుల్ ఆనంద్, కాకర్ల ఉష, అపూర్వ.

# పింఛన్ బకాయిల కోసం ధర్నా

చెన్నై, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా సంస్థలో 109 నెలలుగా నిలిపివేసిన కరువు భత్యం చేర్చి ప్రతినెలా పింఛన్ ఇవ్వాలనే డిమాండ్‌తో మంగళవారం పల్లవన్ హౌస్ వద్ద ఆ సంస్థ మాజీ కార్మికులు ధర్నా నిర్వహించారు. 15వ వేతన సంఘం వేతన పెంపును పింఛన్ దారులుగా ఉన్న తమకు కూడా వర్తింపజేయాలని మాజీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం అధికారంలో ఉందని, రవాణా సంస్థ పెన్షనర్లు, వృద్ధాప్యంలో ఉన్న కార్మిక సోదరులను కష్టాలపాలు చేయడం భావ్యమేనా అని ప్రశ్నించారు. ఇకనైనా డీఎంకే ప్రభుత్వం రవాణా సంస్థ పింఛన్‌దారుల బకాయిలన్నింటిని చెల్లించాలని డిమాండ్ చేశారు.



పల్లవన్‌హౌస్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న డీఎంకేడీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత



మంగళవారం ఉదయం శుభ్రపరిచారిలా..

## చెత్తతీసి.. కల్లాపు చల్లి!

అది తిరుపతి నగరం కొర్లగుంట జంక్షన్ నుంచి పాత కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారి. ఇంటింటికీ చెత్త సేకరణ జరుగుతున్నా.. కొందరు స్థానికులు ఈ దారిలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మరు వద్ద చెత్త వేస్తున్నారు. ఎంత చెప్పినా ఎవరూ వినిపించుకోలేదు. చివరకు 'ఇచ్చట చెత్త వేయరాదు. వేసినచో రూ.1000 జరిమానా విధించబడును' అని కమిషనరు పేరిట హెచ్చరిస్తూ ఫ్లెక్సీ పెట్టారు. అయినా.. చెత్త వేయడం ఆపలేదు. చివరకు పారిశుధ్య సిబ్బంది వినూత్న ఆలోచనతో ముందుకొచ్చారు. మంగళవారం ఉదయానికంతా అక్కడ 'చెత్త'శుద్ధి చేశారు. పేడ నీటితో కల్లాపు చల్లారు. కుండీల్లో పూలమొక్కలు పెట్టారు. ఇలాగైతే స్థానికుల్లో మార్పు వచ్చి చెత్త వేయరన్న భావనతో ఈ పనులు చేశారు. పారిశుధ్య సిబ్బంది ఆశించిన ఈ మార్పు ప్రజల్లో వస్తే.. తిరుపతి స్వచ్ఛ నగరం అవుతుంది.

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి

## 17 ఇసుక ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్



అక్రమంగా ఇసుక తరలిస్తున్నారంటూ మంగళవారం రెవెన్యూ అధికారులకు వచ్చిన ఫిర్యాదుపై దాడి చేశారు. పోలీసుల సహకారంతో 17 ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు ఆర్ఐ జైకృష్ణ తెలిపారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డికి అందిన ఫిర్యాదు మేరకు తాము పిల్లపాళ్యం స్వర్ణముఖినది సమీపంలోని ప్రైవేటు భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు నిర్వహించామన్నారు. ఇసుక తరలిస్తున్న 7 ట్రాక్టర్లు, పది ఖాళీ ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి గాజులమద్యం పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. వీఆర్వో విశ్వనాథం ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుధాకర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి





## సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమలలో స్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

**ఆదివారం నాటి హుండీ ఆదాయం:** రూ.3.36 కోట్లు


**సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు :** 62,112

**తలనీలాలు సమర్పించినవారు:** 22,541



తిరుపతి(నేరవిభాగం) ఆంధ్రజ్యోతి

# మీ కళ్లెదుట ప్రమాదం జరిగిందా?



### కాపాడినందుకు కోర్టుకు తిరగనవసరం లేదు
### పోలీసులూ, ఆసుపత్రుల వేధింపులుండవు
### కేంద్రం మార్గదర్శకాలు

రోడ్డు మీద ప్రమాదం జరుగుతుంది. రక్తగాయాల్లో చెల్లాచెదురుగా పడిపోయి ఉంటారు. ఆ దారినపోయేవారు కొందరు ఆగి చుట్టుముడుతారు. కొందరు దూరంగా ఉండి, వివరాలు కనుక్కుంటారు. మరికొందరు వెంటనే మొబైల్ బయటకు తీసి వీడియో తీస్తుంటారు. ఒకరో ఇద్దరో పూనుకుని 108కి ఫోన్ చేస్తారు.

... రోడ్డు ప్రమాదాల సమయంలో సాధారణంగా కనిపించే దృశ్యం ఇది. గాయపడ్డవారిని తక్షణం తామే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం మాత్రం దాదాపుగా ఎవరూ చేయరు. నిజానికి రోడ్డు ప్రమాద సంఘటనల్లో గోల్డెన్ అవర్ కీలకమైనది. అంటే ప్రమాదం జరిగిన గంటలోగా ఆసుపత్రికి చేర్చగలిగితే మరణాలను నిరోధించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. తమ వాహనంలోనో లేదా ఆటోలోనో ఆసుపత్రికి తీసుకువెళ్లే సాహసం జనం చేయరు. అరుదుగా ఏ నాయకులో, అధికారులో చేసినపుడు ఇది వార్త అవుతుంటుంది.

**ఎందుకిలా?**

ఎందుకంటే మంచి చేసినా అది తమకు అంటుకుంటుందన్న భయం. సమీపంలో ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్తే, తీసుకువెళ్లిన వారి వివరాలు రాసుకుంటారు. ఆ తర్వాత పోలీసు వేధింపులు మొదలవుతాయి. సవాలక్ష ప్రశ్నలు ఎదురవుతాయి. సాక్ష్యంగా కోర్టుకు రమ్మంటారు. మానవత్వంతో చేసిన సాయానికి కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉండాలా.. అన్న ఆందోళన వల్లే రోడ్డు ప్రమాద సంఘటనల్లో ప్రజల ఉదాసీనతకు కారణం. ఇటువంటి కారణాలను గుర్తించే కేంద్ర ప్రభుత్వం ఖచ్చితమైన మార్గదర్శకాలను జారీ చేసింది. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆ వివరాలను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలియజేశారు. రోడ్డు ప్రమాద బాధితులకు మానవతా దృక్పథంతో తక్షణం సాయం అందించండి అని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

**కేంద్రం మార్గదర్శకాలు ఇవీ..**

- ప్రమాద బాధితులకు సహాయకారిగా వచ్చిన వ్యక్తిని ఆసుపత్రి సిబ్బందిగానీ, పోలీసులుగానీ వేధించకూడదు. బాధితుడిని తక్షణం ఆసుపత్రిలో చేర్చుకుని వైద్య సేవలు అందించాలి.
- సాక్ష్యం చెప్పండి అంటూ బలవంతం చేయకూడదు.
- సాక్ష్యం చెబుతామని ముందుకు వచ్చిన వారి విచారణ ఒక్క రోజులోనే ముగించాలి. రెండవసారి పిలవకూడదు.

"రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసిన వ్యక్తులకు గౌరవ సూచకంగా రూ 5000 పారితోషికం జిల్లా కలెక్టర్ ఇస్తారు. వారి సేవలను గుర్తిస్తూ యోగ్యతా పత్రం కూడా అందిస్తారు."

# అ'దృశ్యం'

- భర్త కనబడలేదంటూ పోలీసులను ఆశ్రయించిన భార్య
- దర్యాప్తులో తీగ లాగితే డొంక కదిలిన వైనం
- వీడిన మర్డర్ మిస్టరీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నేరాలు, చోరీలు చేసి తాత్కాలికంగా కప్పిపుచ్చుకున్నా దొరికిపోక తప్పదు. అలా ఎలక్ట్రీషియన్ హత్య బయట పడటానికి 50 రోజులు పట్టింది. అదృశ్యం కేసుపై విచారణ చేపడితే హత్య విషయం వెలుగులోకి వచ్చింది. మర్డర్ మిస్టరీ కూడా వీడింది. శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐ గోపి తెలిపిన ప్రకారం.. ఏర్పేడు మండలం పల్లం గొల్లపల్లికి చెందిన వెంకటేష్, వసంత దంపతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. శ్రీకాళహస్తి పట్టణంలోని కొత్తపేటలో కాపురం ఉంటూ స్వగ్రామానికి వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుని వచ్చేవారు. అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు చెందిన ప్రభాకర్ పదేళ్ల కిందట ఎలక్ట్రీషియన్ పనుల కోసం శ్రీకాళహస్తికి వచ్చాడు. కొత్తపేటలోనే ఓ మిత్రుడితో కలిసి అద్దె గదిలో ఉంటున్నాడు. ఖాళీ రోజుల్లో ఇంటికి వెళ్లి వస్తుండేవాడు. ఈ క్రమంలో వెంకటేష్ కుటుంబంతో ఇతడికి సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. వసంతతో చనువుగా మెలిగేవాడు. ప్రభాకర్, అతడి తరపు బంధువులు పలుమార్లు ఇద్దరిని మందలించినా మార్పు రాలేదు. దీని వల్ల వెంకటేష్, వసంత మధ్య విభేదాలు తలెత్తాయి. నాలుగు నెలల కిందట గొడవ జరగడంతో వెంకటేష్ స్వగ్రామానికి వెళ్లిపోయాడు. వసంత మాత్రం శ్రీకాళహస్తిలోనే ఉన్నారు. ఎలక్ట్రీషియన్ ప్రభాకర్ కారణంగా తన భార్య దూరమైందని వెంకటేష్ ఆగ్రహం పెంచుకున్నాడు. తన భార్య సోదరుడైన ఆటో డ్రైవర్ సుబ్రహ్మణ్యం, అల్లుడు హేమంత్‌కుమార్‌తో కలిసి అతడి అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు. అక్టోబరు 24న ముగ్గురు కలిసి మద్యం తాగేందుకు రావాలంటూ శ్రీకాళహస్తిలో కొత్తపేట వద్ద ఎలక్ట్రీషియన్ ప్రభాకర్‌ను ఆటో ఎక్కించుకున్నారు. నలుగురూ మద్యం తాగారు. ఆటోలో పల్లం గొల్లపల్లి శివారులోని శ్మశానం సమీపంలోకి వచ్చేసరికి ప్రభాకర్.. నిద్రలోకి జారుకున్నాడు. ముగ్గురూ కలిసి బండరాయితో అతడి తలపై కొట్టి హత్య చేశారు. కాలువ పక్కన మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. నాలుగు రోజులైనా ప్రభాకర్ రాకపోవడంతో.. అద్దె గదిలో ఉండే మిత్రుడు ఆయన భార్యకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. తన భర్త ప్రభాకర్‌కోసం సుధ పలుచోట్ల ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో నవంబరు 25న శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో వసంతతో సన్నిహితంగా మెలిగేవాడన్న విషయాన్ని గుర్తించారు. ఆ తరువాత లోతుగా కూపీ లాగడంతో ఆమె భర్త, సోదరుడు, అల్లుడు కలిసి ప్రభాకర్‌ను చంపినట్లు నిర్ధారించారు. ఈ మేరకు మంగళవారం ఘటనా స్థలానికి చేరుకుని ప్రభాకర్ అవశేషాలను వెలికి తీసి.. అక్కడే ప్రభుత్వ వైద్యాధికారులతో పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, ముగ్గురు నిందితులు ఓ రెవెన్యూ అధికారి వద్ద లొంగిపోయినట్లు తెలిసింది. మొత్తమ్మీద అ'దృశ్యం' కేసులో దర్యాప్తు చేపడితే మర్డర్ మిస్టరీ వీడింది. సినిమా తరహాలో మృతదేహాన్ని పాతిపెట్టడం చర్చనీయాంశంగా మారింది.


మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యులు -ప్రభాకర్ (ఫైల్ ఫొటో)


రాగిమాను వద్ద పెద్ద మర్యాద స్వాగత సత్కారాలు అందుకుంటున్న పెద్ద జీయర్ స్వామి

## పెద్దజీయర్ స్వామికి తిరునక్షత్ర మర్యాద

తిరుమల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): పెరియ కోయిల్ కేల్వి అప్పన్ శఠగోప రామానుజ పెద్దజీయర్ స్వామి 75వ జన్మదినం సందర్భంగా మంగళవారం పెద్దజీయర్ స్వామికి ఆలయంలో తిరునక్షత్ర మర్యాద జరిగింది. రాగిమాను వద్ద ఇస్తికఫాల్ స్వాగతం లభించింది. మేళతాళాల మధ్య చిన్నజీయర్ స్వామితో కలిసి ఆయన ఆలయం వద్దకు చేరుకున్నారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ మహాద్వారం వద్ద స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, డిప్యూటీఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ పాల్గొన్నారు.

## శ్రీవారిసేవలో ఎల్లా


ప్రీతి నిగమ్, నగేస్ కర్రా - ఎల్లా వెంకటేశ్వర్లు

తిరుమల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. జనసేన పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బొలిశెట్టి సత్యనారాయణ, సినీనటి ప్రీతి నిగమ్, నగేష్ కర్నా దంపతులు, ప్రముఖ మృదంగ వాయిద్య కళాకారుడు ఎల్లా వెంకటేశ్వర్లు ఉన్నారు.


## బ్యాంకులో దోపిడీకి యత్నం

- యువకుడిని పట్టుకుని చితకబాదిన ఖాతాదారులు



రేణిగుంట డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో దోపిడీకి యత్నించిన యువకుడిని స్థానికులు పట్టుకుని కట్టేసి చితకబాదారు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం తిరుపతి- రేణిగుంట రోడ్డులోని ఇండియన్ బ్యాంకులో జరిగింది. కృష్ణతేజ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న ఈ బ్యాంకులోకి సాయంత్రం మూసివేసే సమయంలో ఓ యువకుడు ముఖానికి కర్చీఫ్ కట్టుకుని, బ్యాగులో కత్తిని పెట్టుకుని ప్రవేశించాడు. క్యాషియర్ పక్కన ఉన్న అకౌంటెంట్ మెడపై కత్తి పెట్టి డబ్బులు బ్యాగులో వేయాలని బెదిరించాడు. అదే సమయంలో బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులు ఆ యువకుడిని మాటల్లో దింపి చాకచక్యంగా పట్టుకున్నారు. బయటకు తీసుకొచ్చి గ్రిల్‌కు కట్టేసి చితకబాదారు. తాను రూ.5 లక్షల అప్పుల పాలయ్యానని, ఆ బాధ తట్టుకోలేక చోరీకి వచ్చినట్లు అతడు చెప్పాడు. తాను లక్ష్మీపురం సర్కిల్‌లో ఉంటానని, శ్రీకాళహస్తి ఆలయం సమీపంలో ఇల్లు ఉందని, డిగ్రీ వరకు చదువుకున్నానని చెప్పాడు. తిరుచానూరు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, ఆ యువకుడి పేరు పురుషోత్తం అని పోలీసుల విచారణలో తేలింది. వరదయ్యపాలెం మండలం సదనవారిపల్లెకు చెందిన వాడని పోలీసులు తెలిపారు. మెడికల్ రిప్రజంటేటివ్‌గా పనిచేసే ఇతడిని.. ఆర్థిక వ్యవహారాల్లో ఉద్యోగం నుంచి తొలగించారు. బ్యాంకు అప్రైజరును బెదిరించిన కేసులో పురుషోత్తంను అరెస్టు చేశారు. గతంలో ఇతడిపై ఎటువంటి నేరచరిత్ర లేదని సీఐ సునీల్‌కుమార్ వెల్లడించారు.

## షార్‌లో ఆక్టోపస్ బృందం


ఆక్టోపస్ బృందంతో తహసీల్దార్ నరసింహరావు, ఎస్ఐ శ్రీకాంత్

సూళ్లూరుపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌కు మంగళవారం ఆక్టోపస్ బృందం చేరకుంది. డీఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో 52మంది ఆక్టోపస్ సిబ్బంది షార్ పరిధిలో ఉన్న సముద్ర మార్గంతో పాటు ఇతర ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు.తీవ్రవాదులు షార్‌లోకి ప్రవేశించినప్పుడు,సముద్ర మార్గం గుండా చొరబాటుదారులు వచ్చినప్పుడు ఏ విధంగా ఎదుర్కోవాలో ఆక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహించనుంది. ఆక్టోపస్ బృందానికి తహశీల్దార్ ఎస్‌వి.నరసింహరావు, శ్రీహరికోట ఎస్ఐ శ్రీకాంత్ స్వాగతం పలికారు.

## 'వైష్ణవి'కి కార్మికుల కాపలా

- మద్దతు తెలిపిన టీడీపీ నేతలు

పెళ్లకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైష్ణవి డెయిరీని యాజమాన్యం వదిలేసి వెళ్లడంతో కార్మికులు, ఉద్యోగులు షిఫ్టుల విధానంలో కాపలా కాస్తున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదానికి వాడే నెయ్యి కల్తీ చేశారనే కేసులో సిట్ బృందం ఇక్కడకు వచ్చి విచారించడం.. ఉద్యోగులను, కార్మికులను వదిలి యాజమాన్యం వెళ్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం కంపెనీ వద్దకు కార్మికులు, ఉద్యోగులు వెళ్లగా.. సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. దీంతో పరిశ్రమకు కాపలా ఉండి ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని భావించిన కార్మికులు రెండు షిఫ్టులుగా అక్కడ ఉంటున్నారు. స్థానిక టీడీపీ నాయకులు వేలూరు హరినాయుడు, తాళ్ల యుగందర్‌గౌడ్ మంగళవారం వీరికి మద్దతు తెలిపారు. కాగా, సోమవారం యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంగళవారం నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు తన సిబ్బందితో కలసి కంపెనీని సందర్శించి.. పరిశీలించారు.


కార్మికులకు మద్దతు తెలుపుతున్న టీడీపీ నేతలు

## విష జ్వరంతో విద్యార్థి మృతి

- పూడి వంతెన కొట్టుకుపోవడంతో ఇంట్లోనే చికిత్స
- ఆరోగ్యం విషమించి అసువులుబాసిన ఉదయ్


ఉదయ్‌కుమార్ (పాతచిత్రం)

కేవీబీపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం పూడి నీకేపురం గ్రామానికి చెందిన విద్యార్థి విష జ్వరంతో మృతి చెందాడు. చిట్టిబాబు, హేమలత దంపతుల రెండో కుమారుడు ఉదయ్‌కుమార్(14) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామం వద్ద కాజ్‌వే కొట్టుకుపోయింది. దీంతో ఇంటి వద్దే అందుబాటులో ఉన్న మందులతో సరిపెట్టారు. శనివారం జ్వరం ఎక్కువ కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్దామని బయలు దేరారు. యేరు ఉధృతంగా పారుతుండడంతో వెనుదిరిగారు. ఆదివారం తాత్కాలికంగా వంతెన పునరుద్ధరించడంతో కేవీబీపురం పీహెచ్‌సీకి తీసుకెళ్లి పరీక్షల అనంతరం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. తిరుపతిలో వైద్యం పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఉదయ్‌కుమార్ రాగిగుంట పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.

## ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

- రూ.6 లక్షల జరిమానా

మంగళం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి ఐదేళ్ల జైలుశిక్షతోపాటూ ఒక్కొక్కరికి రూ.6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు తిరుపతి న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పునిచ్చినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రకారం వివరాలిలా ఉన్నాయి. తిరుపతి అటవీరేంజ్‌లోని తిమ్మినాయుడుపాలెం బీట్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతూ పూతలపట్టుకు చెందిన పులికంటి శ్రీరాములు, తిరుపతి రూరల్ మండలం తిరుచానూరుకు చెందిన దాసరి రమణయ్యపై టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో నిందితులకు ఐదేళ్ల జైలుశిక్షతో పాటూ ఒక్కొక్కరికి రూ.6 లక్షల జరిమానా విధించారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వారికి ఈ తీర్పు గుణపాఠంగా నిలుస్తుందని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడే వారికి ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా జీవితకాలం వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. శిక్షపడ్డ ఇద్దరినీ నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

## నకిలీ గుర్తింపు కార్డులు తయారు చేస్తే పదేళ్ల జైలు శిక్ష

తిరుమల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం నకిలీ గుర్తింపు కార్డులు తీసుకొచ్చినా.. గుర్తింపు కార్డుల్లో కేడర్ మార్చినా, ఒకరి స్థానంలో మరొకరు వచ్చినా పదేళ్ల జైలు శిక్ష పడుతుందని తిరుమల పోలీసులు మంగళవారం ఓ ప్రకటన ద్వారా హెచ్చరించారు. కన్నియకుమారికి చెందిన రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ విశ్వేశ్వరప్రసాద్ ప్రస్తుతం సౌత్‌జోన్ మిలటరీ క్యాంటీన్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈయన స్వామి దర్శనం కోసం కొందరిని సంప్రదించగా.. ఇతడి గుర్తింపుకార్డును వీరు బ్రిగేడియర్ అధికారిగా నకిలీది సృష్టించి బ్రేక్ దర్శన టికెట్లను పొంది విక్రయించారు. ఈఅక్రమాన్ని సోమవారం గుర్తించిన విజిలెన్స్ అధికారులు వన్‌టౌన్ పోలీసులకు అప్పగించగా వారు కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఈ ప్రకటన విడుదల చేశారు.

## పీఎఫ్ జమచేయలేదని..

- ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్ల విధుల బహిష్కరణ

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీఎఫ్ నగదు జమ చేయలేదని తిరుమల ఘాట్‌లో నడిచే ఆర్టీసీకి చెందిన 50 ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్లు మంగళవారం విధులు బహిష్కరించారు. ఉదయం 6గంటలకు బయల్దేరాల్సిన బస్సులు అలిపిరి డిపోకే పరిమితమయ్యాయి. ఎలక్ట్రిక్ బస్సులను నిర్వహణ చూసే పాత, కొత్త సంస్థలతో ఇంచార్జ్ డీపీటీవో జగదీష్, డిపో మేనేజర్ హరిబాబు చర్చించారు. పదిరోజుల్లో పీఎఫ్ జమ చేయిస్తామని డ్రైవర్లకు హామీ ఇచ్చారు. పాత బకాయిల సమస్యను కూడా పరిష్కరించడంతో మధ్యాహ్నం 3గంటల డ్రైవర్లు విధులకు హాజరయ్యారు. సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులను చెన్నై, వేలూరులకు పంపకుండా తిరుమల-తిరుపతి మధ్య తిప్పారు.


అలిపిరి డిపోకే పరిమితమైన ఎలక్ట్రిక్ బస్సులు

## ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి


కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కనే ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎస్పీ సుబ్బరాయుడితో కలిసి రహదారి భద్రతపై ఆయన అధికారులతో సమీక్షించారు. తనపల్లి జంక్షన్, ఆర్‌సీపురం జంక్షన్, వకుళమాత జంక్షన్ తదితర ప్రాంతాల్లో సోలార్ బ్లింకర్లు, సైన్‌బోర్డు సూచికలు, పాదచారులు రోడ్డు దాటేందుకు మార్కింగ్, సోలార్ హైమాస్ట్ లైట్లు సత్వర ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భాకరాపేట ఘాట్‌తో పాటు జిల్లాలో సుమారు 100 ప్రమాదకర రహదారి బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన కార్యాచరణపై సమీక్షించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. నగరంలో ట్రాఫిక్ పెరిగిన నేపథ్యంలో భారీ వాహనాలను అనుమతించే సమయ నిబంధనలను నిర్ధారించేందుకు రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా సమీక్షించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్, పోలీసు, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## రైల్వే హైవే భూసేకరణ వేగవంతం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు, రైల్వేప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి పనుల పురోగతిపై జేసీ శుభంబన్సల్‌తో కలిసి వర్చువల్ విధానంలో అధికారులతో సమీక్షించారు. భూసేకరణలో వచ్చే సమస్యలను ఎప్పటికపుడు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఎన్‌హెచ్ఏఐ పీడీలు, గూడూరు సబ్‌కలెక్టరు రాఘవేంద్ర మీనా, ఆర్డీవోలు రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, సంబంధిత మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ టెక్నీషియన్ నెట్‌వర్కింగ్ అండ్ స్టోరేజ్‌పై నైపుణ్య శిక్షణ

తిరుపతి(విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ నిర్వహిస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్వి కాస్యోజన (పీఎంకేవీవై)4.0 ద్వారా జిల్లాలో నిరుద్యోగ యువతకు పరిశ్రమలకు కావల్సిన నైపుణ్యాలకు అనుగుణంగా స్కిల్‌హబ్‌లలో శిక్షణ, ఉపాధి అవకాశాలను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కల్పిస్తోందని తెలిపారు. జిల్లాకు చెందిన స్కిల్‌హబ్ ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో 'అసిస్టెంట్ టెక్నీషియన్ - నెట్‌వర్కింగ్ అండ్ స్టోరేజ్' కోర్సుకు సంబంధించి శిక్షణ ప్రారంభించినట్టు వెల్లడించారు. 210 గంటల కాలవ్యవధి కలిగిన ఈ కోర్సుకు 10వ తరగతి, ఆపైన విద్యార్హతలు కలిగివారు అర్హులన్నారు. 81435 76866, 99851 29995 నంబర్లలో సంప్రదించాలని, అలాగే, forms.gle/XeQyn5D7DUWHd3sd6 లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

## పది నెలల బాలుడి గొంతులో ఇరుక్కున్న బ్యాటరీ

- స్విమ్స్‌లో శస్త్ర చికిత్సతో తొలగింపు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రిమోట్‌లకు ఉపయోగించే బ్యాటరీతో పది నెలల బాలుడు ఆడుకుంటూ మింగడంతో గొంతులో ఇరుక్కుపోయింది. స్విమ్స్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం ఆధ్వర్యంలో అతిక్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి బ్యాటరీని తొలగించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మంగళవారం తెలిపారు. శ్రీకాళహస్తికి చెందిన ఈ బాలుడిని కుటుంబ సభ్యులు స్విమ్స్‌కు తీసుకొచ్చారన్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ శివరామకృష్ణ ఆధ్వర్యంలో వైద్యుల పర్యవేక్షణలో అధునాతన వైద్య పరిజ్ఞానంతో బాలుడికి శస్త్ర చికిత్స చేశామన్నారు. అనంతరం బాలుడు పూర్తి ఆరోగ్యంగా కోలుకోవడంతో మంగళవారం బాలుడ్ని డిశ్చార్జి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటరామిరెడ్డి, చంద్రమౌళీశ్వరన్, మనోజ్‌కృష్ణ, తేజస్విని, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులకు 988 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం 53 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, 988 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. భూ ఆక్రమణలపై 29, ఇళ్ల స్థలాలపై 124, అసైన్‌మెంట్ భూములపై 83, క్యాస్ట్ వెరిఫికేషన్ 15, రీసర్వే 21, ల్యాండ్ గ్రాబింగ్ 2, ఆర్‌వోఆర్‌పై 473, ఇతర విషయాలకు సంబంధించి 167 వచ్చాయన్నారు. వాటిలో 15 అక్కడికక్కడే పరిష్కరించినట్లు తెలిపారు.